జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | గురువారం 5 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :291 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,



శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 ; సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 ; చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

క్రిప్టో మోసానికి చెక్..

- తెనాలి మహిళకు రూ.15 కోట్ల రికవరీకి కోర్టు ఆదేశం!
- అంతర్జాతీయ క్రిప్టో ముఠా గుట్టురట్టు
- బ్లాక్‌చెయిన్ ఆధారాలతో సీఐడీ వేట
- నాలుగు ఖాతాల్లో క్రిప్టో ఆస్తులు ఫ్రీజ్
- ఎనిమిది మంది అరెస్ట్.. బాధితురాలికి ఊరట



అమరావతి

అంతర్జాతీయ స్థాయిలో సాగిన భారీ క్రిప్టోకరెన్సీ పెట్టుబడి మోసాన్ని ఆంధ్రప్రదేశ్ సీఐడీ ఛేదించింది. అధిక లాభాల ఆశ చూపి తెనాలికి చెందిన ఓ మహిళ నుంచి సుమారు రూ.15 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టు చేసింది. బ్లాక్‌చెయిన్ - మిగతా3లో



మోదీని ఐదు నిమిషాల్లోనే ఎండగడతా!

- ట్రంప్ నియంత్రణలో ప్రధాని.. దేశద్రోహి అంటూ రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
- మోదీతో ముఖాముఖి చర్చకు సవాల్.. ఏడాదిలోపే ఎన్డీయే సర్కార్ కూలుతుందని జోస్యం
- అమిత్ షాపైనా విమర్శలు.. అదానీ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ ఏమయ్యాయని ప్రశ్న

రైతుకు బీమా పరిహారం త్వరగా అందించాలి!



- కేంద్ర సాయంపై చంద్రబాబు విజ్ఞప్తి
- కరవు, తుపాను బాధితులను ఆదుకోండి
- 200 రోజులకు ఉపాధి పనులు పెంచండి
- రైతుల రుణాల రీషెడ్యూలింగ్‌కు సహకరించండి

అమరావతి

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆర్థిక సాయం అందించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు కోరారు. పంటల బీమా పరిహారాన్ని ఆలస్యం చేయకుండా రైతుల ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. కరవు, తుపాను నష్టాలతో సతమతమవుతున్న రాష్ట్రానికి ప్రత్యేక సాయం మంజూరు చేయాలని కేంద్ర బృందాన్ని కోరారు. గ్రామీణ ఉపాధి పథకం కింద పనిదినాలను 200కు పెంచాలని సూచించారు. కరవు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ బుధవారం ముఖ్యమంత్రి - మిగతా3లో



అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్..

- మరో రెండేళ్లు సైన్యంలో సేవలకు అవకాశం!
- 75 శాతం మందికి రెండో విడత సర్వీస్..
- ఆ తర్వాత రెగ్యులర్ ఫోర్స్‌లో చేరే ఛాన్స్
- నాలుగేళ్ల సేవా కాలం ఆరేళ్లకు పెంపు.. అధిక వేతనంతో అదనపు సర్వీస్
- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు.. 850 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ఆమోదం


కొరియాలో మళ్లీ ఖాకీ వార్!




- రేషన్ బియ్యం వాహనాన్ని అడ్డుకున్న ఒడిశా పోలీసులు
- ఏపీ ఎన్నికల్లో ఓటు వేయొద్దంటూ ఒత్తిళ్లు.. గ్రామస్థుల ఆగ్రహం
- 21 గ్రామాల్లో 5 ఎంపీటీసీ స్థానాలు.. 2,883 మంది ఓటర్లు

భూమిపైకి నాసా టెలిస్కోప్.. భారత్‌కూ ముప్పు!

- దక్షిణ భారతంలో శకలాలు పడే అవకాశం..
- భూవాతావరణంలోకి ప్రవేశించనున్న 'స్విఫ్ట్' అబ్జర్వేటరీ
- ప్రమాదం చాలా తక్కువేనని నాసా అంచనా
- 22 ఏళ్ల అంతరిక్ష సేవలకు ముగింపు





రూ.600కే 1,000 కి.మీ. ఈవీ ప్రయాణం!

- రాత్రి విద్యుత్ యూనిట్ రూ.3కు ఇవ్వాలని గడ్కరీ ప్రతిపాదన
- పగటిపూట రూ.5గా నిర్ణయించాలని సూచన
- పెట్రోల్, డీజిల్‌తో పోలిస్తే భారీగా తగ్గనున్న ఖర్చు

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం ఉండాలి

- నందన్ నీలేకని నేతృత్వంలోని హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ బృందంతో చంద్రబాబు భేటీ
- అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతో సంస్కరణలు చేపట్టాలని సీఎం సూచన
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా పరీక్షల విధానం ఉండాలన్న మంత్రి లోకేశ్
- పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగంపై దృష్టి సారించామన్న నీలేకని
- ఏపీలో అమలవుతున్న టెక్నాలజీ విధానాలపై టాస్క్ ఫోర్స్ ఆసక్తి



అమరావతి

భారతదేశంలోని విభిన్న రాష్ట్రాలు, విభిన్న భాషల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా సంస్కరణలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను గౌరవిస్తూ, ఏకాభిప్రాయంతో అత్యంత పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే వారికైనా న్యాయం జరిగేలా ఈ సంస్కరణలు రూపుదిద్దుకోవాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా సచివాలయానికి విచ్చేసిన నీలేకనికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ - మిగతా3లో

కోస్తాలో తుపాను.. రాయలసీమలో కరవు!

- మురసు ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు ఏరియల్ సర్వే
- తుపాను నష్టంపై సీఎం క్షేత్రస్థాయి పరిశీలన
- 388 మండలాల్లో కరవు.. కేంద్రానికి నివేదిక
- ఉపాధి హామీ పనిదినాలు 200కు పెంచాలి



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఒకవైపు తుపాను బీభత్సం.. మరోవైపు కరవు కష్టాలు ప్రభుత్వానికి సవాలుగా మారాయి. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఏరియల్ సర్వే నిర్వహించి నష్టాలను పరిశీలించారు. అనంతరం కరవు పరిస్థితుల అంచనాకు వచ్చిన అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం సభ్యులతో సమావేశమై రైతుల సమస్యలను వివరించారు. తుపాను, కరవు బాధితులను ఆదుకునేందుకు కేంద్రం తగిన ఆర్థిక సాయం అందించాలని కోరారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని తుపాను ప్రభావిత ప్రాంతాలను చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చినగంజాం, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, ముంపునకు గురైన గ్రామాలు, - మిగతా3లో



సీఈసీ, ఈసీలకు జీవితకాల రక్షణపై సుప్రీం ప్రశ్నలు!

- 2023 చట్టంలోని సెక్షన్ 16పై కేంద్రానికి నోటీసులు
- ఎన్నికల కమిషనర్లకు సంపూర్ణ మినహాయింపు సమంజసమేనా?
- సదుద్దేశంతో చేసిన పనులకే రక్షణ ఉండాలన్న పిటిషనర్
- ఎస్ఐఆర్ వివాదం, జ్ఞానేశ్ కుమార్ వ్యవహారాల ప్రస్తావన

నేడు జగన్ మీడియా ముందుకు!

తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రెస్‌మీట్



ఫ్యాన్ గుర్తుపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు





ప్రజల తీర్పు కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు చెంపపెట్టు

-- బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ సుదీర్ దారా

నందికొట్కూరు అభివృద్ధికి కట్టుబడి ఉంటాం..

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై నమ్మకం ఉంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి, 23 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులకు ఆశీర్వాదం అందించిన పట్టణ ప్రజలందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, పార్టీ సమన్వయకర్త డాక్టర్ సుదీర్ దారా పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చూపిన ఆదరాభిమానాలను ఎప్పటికీ మరిచిపోమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణ ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో, ఎంతో ప్రశాంతంగా, ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో ఎన్ని ప్రలోభాలు, ఒత్తిళ్లు, రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎదురైనా వాటిని పట్టించుకోకుండా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఓటు వేసిన యువత, మహిళలు, పెద్దలు, అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజల తీర్పు చెంపపెట్టు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం పెట్టారని, సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్నారు.

రాయలసీమ సాగునీటి సమస్యలపై ప్రశ్నలు

రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేసీ కెనాల్‌కు సాగునీరు అందించాలని రైతులు కోరుతుంటే, మరోవైపు పరిశ్రమలకు నీటిని తరలిస్తున్నారని విమర్శించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ రైతాంగానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

నందికొట్కూరు అభివృద్ధే మా లక్ష్యం

నందికొట్కూరు పట్టణ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ సుదీర్ దారా తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.ఈ విజయం తమ ఒక్కరిది కాదని, నందికొట్కూరు అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వారి సమస్యలకు పరిష్కారం చూపడమే తమ ప్రధాన బాధ్యతగా భావిస్తామన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటాం

ఎన్నికల సమయంలో తమకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటామని చెప్పారు. ప్రజలు అందించిన ఆదరణ, ఆశీర్వాదాలు తమకు మరింత బాధ్యతను పెంచాయని, నందికొట్కూరు పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. చివరిగా ఫ్యాన్ గుర్తుపై నమ్మకం ఉంచి తమకు మద్దతు తెలిపిన ప్రతి ఓటరుకు మరోసారి శిరస్సు వంచి నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణ అధ్యక్షులు మన్సూర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్రీశైలం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

224 రోజులుగా నిరాహార దీక్ష..

హామీలు అమలు చేయని పాలకులపై బాధితుల ఆగ్రహం



ప్రజా జ్యోతి నందికొట్కూరు రాష్ట్ర శ్రేయస్సు కోసం తమ రక్తమాంసాలను ధారపోసి నిర్మించుకున్న ఇళ్లు, జీవనాధారమైన సారవంతమైన సాగుభూములను త్యాగం చేసిన శ్రీశైలం ముంపు బాధితులకు న్యాయం చేయాలని బాధితుడు జయన్న డిమాండ్ చేశారు. సుమారు లక్షా పదివేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను పాలకులు, రాజకీయ పార్టీలు విస్మరించాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాటికి తమ నిరసన దీక్షలు 224వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.స్వర్గీయ ఎన్టీ రామారావు శ్రీశైలం ముంపు బాధితుల కోసం జీవో నంబర్ 98 విడుదల చేసి సుమారు 40 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఆ జీవో అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇళ్లు, భూములు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు పరిహారంగా ఇంటికొక ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి జీవో విడుదల చేసినప్పటికీ, పాలకులు దానిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా తమ భవిష్యత్తు అంధకారంలోనే మగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదిగో ఇదిగో అంటూ హామీలతో కాలం గడుపుతున్న నాయకులు బాధిత కుటుంబాల జీవితాలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు 32 మంది ముంపు బాధితులు ప్రాణాలు కోల్పోగా, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. బాధిత కుటుంబాల్లో పిల్లల చదువులు కొనసాగక, ఆడపిల్లల వివాహాలు జరగక ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.నేతలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంతో బాధితులు అర్ధాకలితో అలమటిస్తున్నారని, వారి ఆవేదనను పాలకులు అర్థం చేసుకోవాలని జయన్న కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తమ త్యాగాలకు తగిన న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్పందించి 224 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షలకు మద్దతు తెలిపి, ముంపు బాధితుల పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సహకరిస్తున్న పాత్రికేయ సోదరులందరికీ శ్రీశైలం ముంపు బాధితుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిరాహార దీక్షలో పెద్ద స్వామన్న, నారాయణ, నాగేంద్రుడు, మురళి, రామకృష్ణ, మౌలాలి, నాగరాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎంపీటీసీ స్థానాల...ఎన్నికలకు సర్వం సిద్ధం





నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం

5 గంటల వరకు పోలింగ్...

దువ్వూరు, నవంబరు04 (ప్రజా జ్యోతి) మండల పరిధిలోని రెండు ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు మండల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.మండలలోని 15 ఎంపీటీసీ స్థానాలలో 13 ఏకగ్రీవం అవ్వగా,మిగతా రెండు ఎంపీటీసీ స్థానాలలో టీ.చల్ల బసాయ పల్లె,నీలాపురం ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు.పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి చంద్రబాబు తెలిపారు. గురువారం (నవంబర్ 5) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన వదూవరులను ఆశీర్వదించిన బీసీ ఇందిరారెడ్డి



బనగానపల్లె:నవంబర్ =04 ప్రజాజ్యోతి బనగానపల్లె మండలం నందివర్గం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కే.శే., గాండ్ల పెద్ద ఈశ్వరయ్య (మాజీ విఆర్ఓ) గారి మనుమరాలి వివాహ ముహూర్త వేడుకకు హాజరై కాబోయే నూతన వధువును ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు సీల్స్

పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం

-- ఐదు మండలాల్లో మద్యం, కల్లు దుకాణాలు మూసివేత



ప్రజా జ్యోతి నందికొట్కూరు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సాధు రవికుమార్ సూచనల మేరకు ఐదు మండలాల్లోని మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలను సీజ్ చేసి మూసివేశారు. పగిడ్యాల, మిడ్తూరు, కడమూరు, జూపాడు బంగ్లా, కొణిదెల మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలకు అధికారులు సీల్స్ వేశారు. అదేవిధంగా ఆయా మండలాల పరిధిలోని కల్లు దుకాణాలు, కల్లు కోఆపరేటివ్ సొసైటీలకు కూడా సీల్స్ వేసి కార్యకలాపాలను నిలిపివేశారు.స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, ఇతర మత్తు పదార్థాలను వినియోగించకుండా అడ్డుకోవడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ ఎక్కడా మద్యం, మత్తు పదార్థాలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

ఘన విజయం సాధించిన భార్గవ్ తేజ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికీ సన్మానం





ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భార్గవ్ తేజ్ గెలుపొందిన సందర్భంగా నందికొట్కూరు పట్టణం లో ని వైసీపీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ భార్గవ్ తేజ్‌ను శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భార్గవ్ తేజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, ఓటు వేసి గెలిపించిన 18వ వార్డు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, వార్డులోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

క్రిప్టో మోసానికి చెక్..

-మొదటిపేజీ తరువాయి

లావాదేవీలను విశ్లేషించి, విదేశీ క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లోకి తరలించిన డిజిటల్ ఆస్తులను గుర్తించి స్తంభింపజేసింది. బాధితురాలికి ఆ ఆస్తులను తిరిగి అందించేందుకు గుంటూరు కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో అంతర్జాతీయ ముఠాకు చెందిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐడీ వెల్లడించింది.

అధిక లాభాల ఆశతో వల

తెనాలికి చెందిన మహిళను అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు విడతలవారీగా సుమారు రూ.15 కోట్ల విలువైన మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టింది. తొలుత తన బ్యాంకు ఖాతాల నుంచి 13 క్రిప్టో వాలెట్లకు నిధులు బదిలీ చేసింది. వీటిలో ఒకటి రాబిన్‌హుడ్ వాలెట్ కాగా, మరో 12 ఆన్‌చైన్ వాలెట్లు ఉన్నాయి. అనంతరం నిందితుల సూచనల మేరకు హనీకోంబ్ఏపీఐ.ఆర్గ్, అలీబార్బిట్.బిట్ అనే నకిలీ పెట్టుబడి ప్లాట్‌ఫామ్‌లకు క్రిప్టోకరెన్సీని బదిలీ చేసింది.

27 లావాదేవీలతో నిధుల తరలింపు

బిట్‌కాయిన్, సోలానా, డాగీకాయిన్ రూపంలో సుమారు 1.5 మిలియన్ డాలర్ల విలువైన 27 లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో గుర్తించారు. బాధితురాలి నుంచి అందిన క్రిప్టో ఆస్తులను నిందితులు నేరుగా తమ ఖాతాల్లోకి తీసుకోకుండా పలు దశల్లో మళ్లించారు. మ్యూల్ ఖాతాలు, ఇతర మధ్యవర్తి ఖాతాల ద్వారా నిధులను తరలిస్తూ వాటి అసలు మూలాలను గుర్తించడం కష్టతరం చేసేలా వ్యవహరించారు. చివరకు ఈ నిధులు కేమన్ ఐలాండ్స్ కేంద్రంగా పనిచేసే గేట్ గ్లోబల్ కార్పొరేషన్‌కు చేరినట్లు సీఐడీ గుర్తించింది.

బ్లాక్‌చెయిన్ విశ్లేషణతో కీలక ఆధారాలు

క్రిప్టో లావాదేవీలను గుర్తించడం కోసం సీఐడీ అధికారులు సాంకేతిక దర్యాప్తు చేపట్టారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (×4జ) సహకారం తీసుకున్నారు. బ్లాక్‌చెయిన్ లావాదేవీలను క్షుణ్ణంగా విశ్లేషించి, 15 బిట్‌కాయిన్ లావాదేవీలను గేట్.ఐఓ ఎక్స్ఛేంజ్‌లోని నాలుగు ఖాతాలతో అనుసంధానించారు. ఈ ఖాతాలు అంతర్జాతీయ నేర ముఠాకు చెందినవిగా గుర్తించి, న్యాయపరమైన ప్రక్రియ ద్వారా వాటిలోని క్రిప్టో ఆస్తులను



స్తంభింపజేశారు.

ఎనిమిది మంది అరెస్ట్.. ఛార్జిషీట్ దాఖలు

ఈ అంతర్జాతీయ సైబర్ నేర ముఠాతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని సీఐడీ అరెస్ట్ చేసింది. వీరిలో ఇద్దరు హైదరాబాద్‌కు చెందినవారు కాగా, మరో ఇద్దరు మహారాష్ట్రకు చెందినవారు. మిగిలిన వారిలో ఇద్దరు చైనాకు, ఒకరు మలేషియాకు, మరొకరు పోర్చుగల్‌కు చెందినవారు ఉన్నారు. నిందితులపై గుంటూరులోని సంబంధిత న్యాయస్థానంలో ఛార్జిషీట్ కూడా దాఖలు చేసినట్లు సీఐడీ తెలిపింది.

అక్టోబర్ 30న కోర్టు కీలక ఉత్తర్వులు

ఈ కేసులో గుంటూరులోని ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ సీఐడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం అక్టోబర్ 30, 2026న ఆస్తుల తిరిగి అప్పగింతకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. స్తంభింపజేసిన నాలుగు ఖాతాల్లోని క్రిప్టో ఆస్తులను అప్పటి మార్కెట్ విలువ ప్రకారం యూఎస్‌డీటీ (ఖాణు)గా మార్చాలని గేట్ గ్లోబల్ కార్పొరేషన్‌ను ఆదేశించింది. ఆ మొత్తాన్ని బాధితురాలు సూచించిన క్రిప్టో వాలెట్‌కు బదిలీ చేయాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో బాధితురాలికి సొమ్ము తిరిగి అందే ప్రక్రియకు మార్గం సుగమమైంది. అయితే, ఆ మొత్తం ఇప్పటికే ఆమె వాలెట్‌లో జమైందని కాకుండా, బదిలీ చేయాలని కోర్టు ఆదేశించిందని సీఐడీ ప్రకటన స్పష్టం చేస్తోంది.

అధిక లాభాల హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

క్రిప్టోకరెన్సీ, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో అధిక లేదా హామీతో కూడిన లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తులు, సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐడీ సూచించింది. తెలియని ప్లాట్‌ఫామ్‌లలో పెట్టుబడులు పెట్టవద్దని, అనుమానాస్పద లింకులు, వాలెట్లకు డబ్బు బదిలీ చేయవద్దని హెచ్చరించింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సైబర్ మోసంలో డిజిటల్ ఆస్తులను గుర్తించి, బాధితురాలికి తిరిగి అందించేలా కోర్టు ఉత్తర్వులు సాధించడం దర్యాప్తులో కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

కోస్తాలో తుపాను.. రాయలసీమలో కరవు!

-మొదటిపేజీ తరువాయి

దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. కారంచేడు, కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు ప్రాంతాల్లో నిలిచిన ముంపు నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.

ఏలూరు గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు

ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం తదితర గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న నీటిపారుదల చెరువులు పొంగిపొర్లుతున్నట్లు తెలిపారు. వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

388 మండలాల్లో కరవు

మరోవైపు రాష్ట్రంలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందం సభ్యులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ నెల 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ పరిస్థితులను చంద్రబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. కోస్తాంధ్ర తుపానులతో ఇబ్బందులు పడుతుంటే, రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాలు వర్షాభావం, ఎల్‌నినో ప్రభావంతో కరవును ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

అనంతపురంలో ఆందోళనకర పరిస్థితులు

ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన జిల్లాగా అనంతపురం పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే 21 జిల్లాల్లోని 388 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించి, నష్టాల అంచనాతో కేంద్రానికి నివేదిక సమర్పించినట్లు చెప్పారు. వారం రోజుల్లోగా మరింత సమగ్ర నివేదికను పంపుతామని వెల్లడించారు.



ఉపాధి హామీ పనిదినాలు 200కు పెంచాలి

కరవు పరిస్థితులను అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకోసం వీబీ–జీ రామ్‌జీ పథకం కింద పనిదినాలను 200కు పెంచాలని కేంద్ర బృందాన్ని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు కూడా వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల వ్యవసాయ కూలీల కొరత తగ్గడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

రైతులకు కేంద్రం అండగా నిలవాలి

కరవు కారణంగా రైతుల ఆదాయాలు తగ్గి, వ్యవసాయ రుణాల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చంద్రబాబు తెలిపారు. అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు డ్రాట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని, రైతుల రుణాల రీషెడ్యూలింగ్‌కు సహకరించాలని కోరారు. పంటల బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించి పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పశుగ్రాసం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

నీటి వనరుల అభివృద్ధికి సహకరించాలి

భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో అనేక ప్రాంతాల్లో బోర్లు వేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదని సీఎం వివరించారు. తాత్కాలికంగా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ విస్తరణకు కేంద్రం సహకరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

15 రోజుల్లో కేంద్రానికి నివేదిక

రాష్ట్రంలో కరవు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రభుత్వం అందించిన వివరాలను పరిశీలించిన అనంతరం 15 రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ×వీజు సభ్యులు తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అందించాల్సిన సాయంపై కేంద్రం తదుపరి చర్యలు తీసుకోనుంది. మరోవైపు కోస్తాంధ్రలో తుపాను కారణంగా పంటలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని కూడా చంద్రబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. వరుస ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి ఈడీ కస్టడీ

ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజులు విచారించనున్న అధికారులు

ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడు

ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయంపై ఈడీ ఆరా

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.



ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

రైతుకు బీమా పరిహారం త్వరగా అందించాలి!



-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబుతో సమావేశమైంది. ఈ నెల 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించింది. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా రాయలసీమలో సాగు, తాగునీరు, పశుగ్రాసం సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సీఎం వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 388 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు.

ఉపాధి పనిదినాలు 200కు పెంచాలి

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వీబీజీ రామ్‌జీ పథకం కింద పనిదినాలను 200కు పెంచాలని చంద్రబాబు కోరారు. వ్యవసాయ పనులకు ఈ పథకాన్ని వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తే రైతులకు కూలీల కొరత తగ్గడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు డ్రాట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని, రైతుల రుణాల రీషెడ్యూలింగ్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పంటల బీమా క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలి

పడిపోయిన భూగర్భ జలమట్టాలను పెంచేందుకు జల్ జీవన్ మిషన్‌ను విస్తరించాలని సీఎం సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానానికి కేంద్రం సహకరించాలని కోరారు. పంటల బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా రైతుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పశుగ్రాసం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని వివరించారు.

15 రోజుల్లో కేంద్రానికి నివేదిక

రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని బృందం సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరోవైపు కోస్తాంధ్ర జిల్లాల్లో తుపాను కారణంగా పంటలు, ఇతర రంగాలకు జరిగిన నష్టాన్ని కూడా చంద్రబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. వరుస ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరారు.

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం ఉండాలి



-మొదటిపేజీ తరువాయి

సాదరంగా స్వాగతం పలికారు. ఈ భేటీలో టాస్క్ ఫోర్స్‌కు పలు కీలక సూచనలు చేసిన చంద్రబాబు, నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానంలో మార్పులు రావాలని అన్నారు. విద్య కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకూడదని, విద్యార్థులలో నైపుణ్యాలు, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గాలి: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని తగ్గించేలా పరీక్షల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి విద్య, ఉద్యోగాల కోసం వెళ్లేటప్పుడు భాష, విద్యా విధానం, ధ్రువీకరణ పత్రాల పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు జాతీయ స్థాయిలో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ వినియోగం గురించి వివరిస్తూ, రాష్ట్రంలో 'డేటా లేక్' ద్వారా వివిధ రంగాల సమాచారాన్ని ఒకేచోట సమీకరించి, మెరుగైన పాలనా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

పరీక్షల విధానంలో సమూల మార్పులే లక్ష్యం: నందన్ నీలేకని

అనంతరం టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడంపై తాము ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేస్తున్నామని వివరించారు. ఈ సంస్కరణల రూపకల్పనలో భాగంగా తాము వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని, ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతను వినియోగించి అమలు చేస్తున్న విధానాలపై ఆయన ప్రత్యేక ఆసక్తిని వ్యక్తం చేశారు.

నేడు జగన్ మీడియా ముందుకు!

తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ ప్రెస్‌మీట్ జరగనుంది. రాష్ట్రంలోని సమకాలీన రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలపై ఆయన మీడియాతో మాట్లాడనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ తన అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ అనుసరించనున్న వైఖరిపై ఆయన మాట్లాడతారని పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

పార్టీ శ్రేణుల్లో ఆసక్తి

జగన్ మీడియా సమావేశం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వ్యాఖ్యల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రెస్‌మీట్‌లో ఏయే అంశాలను ప్రస్తావిస్తారు? ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు? భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై ఏమైనా సంకేతాలు ఇస్తారా? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.


ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించాలి!డీఎల్‌డీఓ కే. సురేష్ కుమార్.



ఆలమూరు, నవంబర్ 4 (ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలోని 18 గ్రామాల్లో ఈరోజు గురువారం నవంబర్ 5 వ తేదీన జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పూర్తి నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) కే. సురేష్ కుమార్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన ఆలమూరులోని సిద్ధార్థ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) కేంద్రాన్ని బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్వో లక్ష్మీ ప్రత్యూష, ఏఆర్వోలు, ఎంపీడీఓ ఏ. రాజు, తహసీల్దార్ కే. కుశరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశిత విధానాల ప్రకారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలించే సమయంలో పూర్తి అప్రమత్తత పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ పరిశీలనలో ఎంఈఓలు బి. అప్పాజీ, ఎన్. రాజుతో పాటు రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరంవాగుపై ప్రవహిస్తున్న వరదనీరు!..

ఇబ్బందులు పడుతున్న ప్రజలు!..



వరరామచంద్రాపురం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి ప్రతినిధి) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్నవరం వాగు తీవ్ర ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అసలే గురువారం స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. ప్రస్తుతం వర్షం, కురవడం ఆగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అన్నవరం వాగుపై వరదతగ్గడంతో యధావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. గురువారం పరిస్థితి ఏలా?ఉంటుందో వేసిచూడాలి.

ఓటమితో వెనకడుగు వేయను..

ఏబీఎం పాలెం అభివృద్ధే నా లక్ష్యం!

30 ఓట్ల తేడాతో ఓటమి.. అయినా ప్రజలకు దూరం కాను: కాటేపోగు చిన్నరాజు

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించిన చిన్నరాజు



ప్రజా జ్యోతి నందికొట్కూరు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనంత మాత్రాన ప్రజలకు దూరమయ్యేది లేదని నందికొట్కూరు మున్సిపాలిటీ ఒకటో వార్డు అభ్యర్థి కాటేపోగు చిన్నరాజు స్పష్టం చేశారు. ఎన్నికల్లో 36 ఓట్ల తేడాతో ఓటమి పాలైనప్పటికీ ప్రజాసేవ విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని తెలిపారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ ఏబీఎం పాలెం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఎన్నికల ఫలితం తనకు నిరాశ కలిగించినప్పటికీ వార్డు ప్రజలతో తనకున్న అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఓటు వేసిన ఓటర్ల అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోనని అన్నారు.రాజకీయాలకు అతీతంగా ఏబీఎం పాలెం అభివృద్ధి కోసం పనిచేయడమే తన ప్రధాన లక్ష్యమని చిన్నరాజు వెల్లడించారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంతో కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు తదితర మౌలిక వసతుల కల్పనకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ఘన సన్మానం

ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని కాటేపోగు చిన్నరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఏబీఎం పాలెం అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాశపోగు అర్జున్, మేకల వెంకటరమణ, అడ్డాకుల ప్రభుదాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఓటమి తన ప్రజా జీవితానికి ముగింపు కాదని, ప్రజల కోసం పనిచేయడానికి అదొక కొత్త బాధ్యతగా భావిస్తున్నానని కాటేపోగు చిన్నరాజు పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఏబీఎం పాలెం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.. 6వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తాం





కౌన్సిలర్ దిల్వాద్ విజయంతో భర్త బైరాపురం ఫయాజ్‌కు ఘన సన్మానం

ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు మున్సిపల్ ఎన్నికల్లో 6వ వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి. దిల్వాద్ విజయం సాధించడంతో వార్డులో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఆమె భర్త బైరాపురం ఫయాజ్‌ను వార్డు ప్రజలు ఘనంగా సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. ఎన్నికల్లో దిల్వాద్‌కు మద్దతుగా నిలిచి విజయానికి సహకరించిన వార్డు ప్రజలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బైరాపురం ఫయాజ్ మాట్లాడుతూ 6వ వార్డు ప్రజలు తమ కుటుంబంపై నమ్మకం ఉంచి దిల్వాద్‌ను గెలిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందించిన ఆదరణను ఎప్పటికీ మరిచిపోలేమని, వారి నమ్మకమే తమకు కొండంత బలమని పేర్కొన్నారు.కౌన్సిలర్‌గా దిల్వాద్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. వార్డులో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాల వంటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి ఇంటి సమస్యను తమ సమస్యగా భావించి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, పెద్దలు, అభిమానులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించి వార్డు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని బైరాపురం ఫయాజ్ పేర్కొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బ్యాంకు ఉద్యోగులు



నంద్యాల:నవంబర్=04 ప్రజాజ్వోతి బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులను నేరస్తులుగా పరిగణించి ఫోన్ పే లను నిలబెట్టి ఇబ్బందులకు గురి చేయడము వారి వ్యక్తిగత హక్కులను హరించి వేయడమే నని మాజీ సిపిఎం జిల్లా సీనియర్ జిల్లా నాయకులు మస్తాన్వలి తీవ్రంగా విమర్శించారు బ్యాంకు అధికారులు ప్రజల డబ్బులను ఖాతా తెరిపించుకోమని చెప్పి వారి డబ్బు లను డబ్బులను ఆపివేయడం ఎంతవరకు సమంజసం ప్రశ్నిస్తే మీ ఖాతాలో ఎందుకు అన్ని డబ్బులు ట్రాన్స్ఫర్ అవుతున్నాయి బెట్టింగ్లు ఆడుతున్నారా ఎక్కడికి అని తిరిగి ప్రశ్నిస్తారు మహిళలు ఇటువంటి బెట్టింగులు అదే అలవాటు ఉంటే అలాగే యువకులు విద్యార్థులు మాలాంటి సీనియర్ సిటిజన్ సిటిజన్స్ పైన తప్పుడు ఆరోపణలు చేయడము వారందరికీ మానసికంగా కృంగదీయడమే అవుతుంది మా డబ్బులు బ్యాంకులో పెట్టుకొని మీ చుట్టూ తిరిగి నేరస్తులుగా మీ ముందు ఉండే కన్నా మీ ఖాతాలను రద్దు చేసుకోవడం మంచిది అనే ఆలోచన వస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేటీకరణ జరగక తప్పదు దీనికి కారకులు ఉద్యోగులు నిజాయితీ ఉంటే బాగా డబ్బున్న వాళ్ళు ఆ దాని అంబానీ బడా పారిశ్రామిక వేత్తలు మరియు అవినీతిపరులు సొమ్ము దాచుతుంటే వారికి ఎక్కడివి అని ప్రశ్నించలేరు. అటువంటి వారికే కోట్ల రూపాయలు లక్షల కోట్ల రూపాయలు సాధారణ మధ్యతరగతి ప్రజల డబ్బులు ఇచ్చి దోచుకునేటట్లు చేస్తున్నారు ఈ విషయము దేశ ప్రజలందరికీ తెలుసు అయినా సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది పెట్టడం బ్యాంకు ఉద్యోగులకు అలవాటు అయినది వారి వ్యక్తిగత నెంబరు కేవైసీ ఆధార్ కార్డు లింక్ అన్ని తీసుకొని కూడా ఇబ్బంది పెట్టడం వలన తల్లిదండ్రులు వారి పిల్లలకు పడే తల్లికి దీవెన ఇతర సంక్షేమ పథకాలు ఆగిపోతుంది మరియు రైతుల ఖాతాలు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఆగిపోతుంది ఇతరులు ఎవరైనా పంపే డబ్బులు మరియు హోటల్లో అంగళ్లలో చెల్లించే డబ్బులు అలాగే కరెంటు బిల్లు ఇతర బిల్లులు చెల్లించే వారు అటువంటి అలవాట్లు ఉన్నాయి అని చెప్పడం కూడా వారి పైన నిందారోపణ చేయడమే అవుతుంది గట్టిగా ప్రశ్నిస్తే మా చేతుల్లో లేదు పైనుండి వచ్చింది అంటారు చివరికి వారే తిప్పి తిప్పి పని చేసి పెడతారు ఇందు వలన వారికి అన్ని విధాలుగా ఇబ్బంది పెట్టడమే అవుతుంది అని స్వయంగా అనుభవంతో ఇతరులను బ్యాంకులో ఖాతాదారులను అడిగి తెలుసుకుని బ్యాంకు ఉద్యోగుల పైన తీవ్రంగా విమర్శ చేస్తున్నాను ప్రభుత్వానికి మీకు చేతనైతే సైబర్ నేరగాలను మరియు బ్యాంకులో అవినీతిపరులను ఇతర ఉద్యోగాలు ప్రభుత్వ శాఖలు పనిచేసే వారి అవినీతిని అక్రమాలను అరికట్టండి ప్రజలకు ఇబ్బంది పెట్టడమే వారి వ్యక్తిగత స్వేచ్ఛ ను హరించివేయడమే అవుతుంది ఎవరికైనా తీవ్రంగా హాస్పటల్ సమస్య వచ్చినప్పుడు వారి ఖాతాలో డబ్బులు ఉండి ఫోన్ పే చేయకుండా ఆగిపోయినప్పుడు బ్యాంకు ఉద్యోగులు అందుకు బాధ్యత వహించాలి అని ఆరోపిస్తున్నాను ఇప్పటికైనా పై అధికారులు ఇటువంటి తప్పుడు ఆరోపణలు మానుకొని ఖాతాదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం మాజీ జిల్లా సీనియర్ నాయకులు సీనియర్ సిటిజన్ మస్తాన్వలి నంద్యాల

వరరామచంద్రాపురం, మండలంలో!..

7ఎంపీటీసీ స్థానాలకు!..

1జడ్పీ.టి.సి,ఎన్నికలకు సర్వం సిద్ధం!..

నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్..!.. ఎలక్షన్ అధికారులు!..



వరరామచంద్రాపురం, నవంబర్ 04 (ప్రజాజ్యోతి ప్రతినిధి) మండల పరిధిలోని,7 ఎంపీటీసీ స్థానాలకు,1 జడ్పీ.టి.సి, స్థానానికి, ఎన్నికల నిర్వహణకు మండల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మండలలోని 7 ఎంపీటీసీ స్థానాలలో 1 జడ్పీ.టి.సి, ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. గురువారం నవంబర్ 5 ఉదయం7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన ఓటర్లందరూ తమఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

25వ వార్డులో ప్రజల ఆదరణతో ఉస్మాన్ విజయం

గెలుపుతో బాధ్యత పెరిగింది.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తా: ఉస్మాన్



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉస్మాన్ విజయం సాధించిన సందర్భంగా వైసీపీ కార్యాలయంలో ప్రత్యేక అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ ఉస్మాన్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు అందించారు.ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఉస్మాన్‌ను అభినందిస్తూ, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన కౌన్సిలర్ ఉస్మాన్ మాట్లాడుతూ 25వ వార్డు ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తన ఒక్కడిదే కాదని, తనకు అండగా నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వార్డు ప్రజలందరి సహకార ఫలితమని పేర్కొన్నారు.ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని, వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ వార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఉస్మాన్‌కు అభినందనలు తెలియజేశారు.

ఏజెన్సీ లో పొంగి పొర్లిన కొండ వాగులు



బుట్టాయగూడెం నవంబర్ 04:-(ప్రజాజ్యోతి):- మురుసు తుఫాన్ కారణంగా బుట్టాయగూడెం ఏజెన్సీ ప్రాంతంలో బుధవారం కొండ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని కన్నాపురం తూర్పు పడమర కాలువ, ముప్పిన వారి గూడెంలో అరుసుల కాలువ, విప్పలపాడు, వీరన్న పాలెం,పులి రామన్నగూడెం కాలువలు రహదారుల పై పొంగి పొర్లాయి.దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా జనజీవనం స్తంభించిపోయింది, ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. ఏజన్సీలోని అన్ని గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై నాయి. నేషనల్ హైవే 365 రహదారి పై విప్పలపాడు వద్ద నిర్మిస్తున్న వంతెనకు పెట్టిన సెంట్రింగ్ వరదతో కుప్పకూలింది.వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంవల్ల అలివేరులోని గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం రెండు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి వరద నీరు విడుదల చేశారు. వరదల కారణంగా బుట్టాయగూడెం మండలంలో 5వతేదీన జరగాల్సిన ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు 6వతేదీకి వాయిదా పడింది.

మన్యంలో నేడే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఉదయం 7 గంటలకే మొదలుకానున్న పోలింగ్

368 పోలింగ్ కేంద్రాల్లోనూ 100% వెబ్‌కాస్టింగ్, సీసీ నిఘా

మారుమూల 43 కేంద్రాల్లో మధ్యాహ్నం 3 వరకే

మిగిలిన చోట్ల సాయంత్రం 5 దాకా అవకాశం

1,100 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత

పోలింగ్ ప్రాంతాల్లో నేడు స్థానిక సెలవు

సంయుక్త మీడియా సమావేశంలో కలెక్టర్

కె. దినేష్ కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి వెల్లడి



రంపచోడవరం, నవంబర్ 04.(ప్రజాజ్యోతి): పోలవరం జిల్లాలో గురువారం జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 368 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్.. మారుమూల ప్రాంతాల్లోని 43 పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకే సాగుతుందని, మిగిలిన సాధారణ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు.

సమగ్ర నిఘా.. కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ

ఎన్నికల విధుల్లో 2,500 మంది సిబ్బంది పాల్గొంటున్నారని, వారికి రెండు విడతల్లో సమగ్ర శిక్షణ పూర్తి చేసి పోలింగ్ సామగ్రితో ఆయా కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 100% రికార్డింగ్: పారదర్శకత కోసం మొత్తం 368 కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, వీడియో రికార్డింగ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్: ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు. ఓటరు గుర్తింపు: తమ పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌లు, ఎస్ఈసీ అధికారిక పోర్టల్‌ను ఉపయోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. నేడు స్థానిక సెలవు: ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునే వీలుగా గురువారం పోలింగ్ జరిగే పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, బ్యాంకులకు స్థానిక సెలవు ప్రకటించారు.

1,100 మంది బలగాలతో పటిష్ట బందోబస్తు: ఎస్పీ కే. చక్రవర్తి

ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు 1,100 మంది పోలీసు బలగాలతో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే ఏరియా డామినేషన్, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు పూర్తి చేసి అనుమానితులను బైండోవర్ చేశామని చెప్పారు.

ప్రత్యేక దళాల మోహరింపు

శాంతిభద్రతల పరిరక్షణ కోసం రూట్ మొబైల్స్, స్టాటిక్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ , స్పెషల్ ట్రైకింగ్ ఫోర్స్‌లను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. ప్రలోభాలపై ఉక్కుపాదం: ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, అక్రమ మద్యం రవాణాపై గట్టి నిఘా ఉంచామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమాలపై సమాచారం ఇచ్చే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ప్రజలంతా ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పోలీసుల అప్రమత్తతగా ఉండాలి!

సిఐ విద్యాసాగర్,ఎస్సై నరేష్.

ఆలమూరు నవంబర్ 4(ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలో ఈరోజు అనగా నవంబర్ 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తమైంది ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్,ఆలమూరు ఎస్సై జి. నరేష్ పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆలమూరు పోలీస్ స్టేషన్ వద్ద సీఐ విద్యాసాగర్,ఎస్సై నరేష్ మాట్లాడుతూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తుతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలని వారు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించేలా పర్యవేక్షించాలని, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం,



పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై నిఘా ఉంచాలని, రాజకీయ పార్టీల మధ్య వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సీఐ విద్యాసాగర్,ఎస్సై నరేష్ పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా మున్సిపల్ ఎన్నికల్లో జనసేన విజయ ప్రస్థానం

- ప్రజల నమ్మకమే మా బలం... ప్రజాసేవే మా లక్ష్యం

- జనసేన నాయకులు నవీన్ నిశ్చల్





హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: నవంబర్ 04: శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో అంజి: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో శ్రీ సత్యసాయి జిల్లాలో కూటమి తరఫున విజయం సాధించిన జనసేన పార్టీ చైర్మన్ అభ్యర్థులు కౌన్సిలర్ అభ్యర్థులకు హృదయపూర్వక అభినందనలు శ్రీ సత్యసాయి జిల్లా జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీ నవీన్ నిశ్చల్ తెలియజేశారు అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో విజయం సాధించిన చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులను ఘనంగా అభినందించారు ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ సమన్వయ కర్త ఆకుల ఉమేష్ మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జనసేన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పదవులు అలంకారం కాదు ప్రజాసేవే మా బాధ్యత ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం మా గళం వినిపిస్తామని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ జనసేన పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా సేవలందిస్తామని స్పష్టం చేశారు

2వ వార్డులో వైసీపీ విజయోత్సాహం.. నేతలకు ఘన సన్మానం!

ప్రజల ఆదరణతో గెలుపొందిన కౌన్సిలర్ బొల్లెద్దుల్లా రాధమ్మకు అభినందనలు..

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పూలమాలలతో సత్కారం



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో 2వ వార్డు కౌన్సిలర్‌గా బొల్లెద్దుల్లా రాధమ్మ విజయం సాధించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో విజయోత్సవ వాతావరణం మధ్య ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ 2వ వార్డు ఇన్‌చార్జి బొల్లెద్దుల రమేష్, మాజీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాటేపోగు నాగ సురేష్ కలిసి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకత్వం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌గా విజయం సాధించిన బొల్లెద్దుల్లా రాధమ్మకు నాయకులు, పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ నాయ కత్వం, కార్యకర్తల సమష్టి కృషి, ప్రజల ఆదరణతోనే ఈ విజయం సాధ్యమైందని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తు లో కూడా ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి, వార్డు అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ పాల్గొని నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవ సంబరాల్లో భాగస్వాములయ్యారు.

సుస్థిర జీవనశైలి వారోత్సవం నిర్వహణ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన: డాక్టర్ కే రాఘవేంద్ర చౌదరి



ఎమ్మిగనూరు, నవంబర్ 04(ప్రజా జ్యోతి):బనవాసి క్షేత్ర బచావో అభియాన్‌లో భాగంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), బనవాసి ఆధ్వర్యంలో సుస్థిర జీవనశైలి వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ వ్యర్థాలతో వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ, సౌర పంపుల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే తక్కువ నీటి అవసరమయ్యే కుసుమ, జొన్న, శనగ పంటలను నవంబర్ 15వ తేదీలోపు విత్తుకోవాలని సూచించారు. బయోపాలిమర్ ఆధారిత బహుళ పొరల విత్తన పూత సాంకేతికత ద్వారా జీవన ఎరువులు, జీవ శిలీంధ్రనాశకాలు, పంట సంరక్షణ పదార్థాలను విత్తనాలకు పూతగా అందించి పంటలను జీవ, అజీవ ఒత్తిళ్ల నుంచి రక్షించే విధానాన్ని వివరించారు. ఎంపిక చేసిన రైతులకు ఈ సాంకేతికతను అందజేశారు.

వైకాపా మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ని సన్మానించిన 13వ వార్డు వైకాపా కౌన్సిలర్ సాయి పోగుల రంగమ్మ



గుంతకల్లు నవంబర్ 4 (ప్రజా జ్యోతి): గుంతకల్లు మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్‌సీపీ తరపున ఘన విజయం సాధించిన సాయి పోగుల రంగమ్మ, వార్డు ఇంచార్జ్ సాయి పోగుల వీరేష్, వార్డ్ వైకాపా నాయకులు, కార్యకర్తలు ఈ విజయ ఆనందం లో మాజీ శాసనసభ్యులు, గుంతకల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై. వెంకట్రామిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి వారి ఆశీస్సులు అందుకున్నారు.

సుస్థిర ఆహార వ్యవస్థను అవలంబించండి

గుంతకల్లు నవంబర్ 4



(ప్రజా జ్యోతి): బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా బుధవారం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఆహార వృథాను అరికట్టడం పై "సుస్థిర ఆహార వ్యవస్థ ను అవలంబించండి" అనే ఇతివృత్తంతో గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ డిస్‌ప్లేలు, క్యాటరిం గ్ ప్రాంతాలు, ఆహార విక్రయ కేంద్రాల సమీపంలో పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజా ప్రకటనలు మరియు ప్రయాణికులు, విక్రయదారులతో ప్రత్యక్షం గా చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ శివన్న మాట్లాడి అవగాహన కల్పించారు. ఆహారాన్ని వృథా చేయకుండా వినియోగించడం, బాధ్యతాయుతమైన ఆహార వినియోగ పద్ధతు లను అలవర్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ద్వారా వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి!







ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎన్. రామకృష్ణ!...

వరరామచంద్రాపురం, నవంబర్ 04 (ప్రజాజ్యోతి ప్రతినిధి) పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ,సుస్థిర జీవనశైలి ప్రోత్సాహమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న, బ్రిక్స్ సస్టైనబెల్ లైఫ్ స్టైల్ వీక్-2026 (వన్ వీక్, సెవెన్ ఆక్షన్స్, వన్ ప్లానెట్) కార్యక్రమంలో భాగంగా వి.ఆర్.పురం, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కె.జి.బి.వి)లో అవగాహన కార్యక్రమం నిర్వహించామని రేంజ్ ఆఫీసర్ ఎస్ రామకృష్ణ, తెలిపారు. బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుండి 7వ తేదీవరకు నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలలో భాగంగా విద్యార్థినులకు, పర్యావరణ పరిరక్షణ సహజ వనరుల పొదుపు, పర్యావరణహిత జీవన విధానాలపై అవగాహన కల్పించామన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, భవిష్యత్ తరాలకు, ఆరోగ్యకర మైన భూమిని అందించేందుకు, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ హిత అలవాట్లను పాటించాలని సూచించారు. ఈ వారోత్సవాలలో భాగంగా నిర్దేశించిన ఏడు ప్రధాన అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

1): సేవ్ ఎనర్జ్: విద్యుత్ మరియు ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం.
2):సేవ్ వాటర్ :నీటిని వృథా చేయకుండా సంరక్షించడం.
3):ఆడాప్ట్ హెల్త్ లైఫ్ స్టైల్: ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం.
4):ఆడాప్ట్ సోల్యూషన్ ఫుడ్ సిస్టమ్: స్థానిక, సహజ మరియు పర్యావరణహిత ఆహార విధానాలను ప్రోత్సహించడం.
5): ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండడం.
6):వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి, పునర్వినియోగం మరియు రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం.
7): ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించి,బాధ్యతాయుతంగా పారవేయడం వంటి వాటి గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థినులతో పర్యావరణపరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులు ఈఏడు సూత్రాలను తమ ఇళ్లలో, పాఠశాలల్లో, గ్రామాల్లో ఆచరించడంతో పాటు తల్లిదండ్రులకు, గ్రామ ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సెక్షన్ ఆఫీసర్ చుక్కయ్య, మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు మరియు ప్రకృతి వనరులను సంరక్షించడం, ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను, నాటిదాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగంవల్ల భూమి,నీరు కలుషితమవుతున్నాయని, ప్లాస్టిక్ సంచులకు బదులుగా,వస్త్ర సంచులను ఉపయోగించాల ని విద్యార్థినులకు వివరించారు. చింతూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, సాంకేత్ సునీల్ గరుడ, ఐ.ఎఫ్.ఎస్, మరియు రాజమండ్రి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ టి.జ్యోతి,ఐ. ఎఫ్.ఎస్, సూచనలు మరియు మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు గ్రామప్రజలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెద్ద కొప్పెర్ల గ్రామాన్ని సందర్శించిన డాక్టర్ మహబూబ్ సుబహాని



కోవెలకుంట్ల:నవంబర్=04 ప్రజాజ్యోతి జిల్లా మలేరి యా అధికారి శ్రీ చంద్రశేఖర్ గారు పెద్దకొప్పెర్ల గ్రామాన్ని సందర్శించారు. రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ మహబూబ్ సుబహాని మరియు పెద్దకొప్పర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో గ్రామంలో క్రింది కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
1. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి జ్వర సర్వే నిర్వహించడం జరిగింది.
2. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించేందుకు లార్వా సర్వే నిర్వహించడం జరిగింది.
3. దోమల లార్వా పెరుగుదలను అరికట్టేందుకు యాంటీ లార్వల్ చర్యలు చేపట్టడం జరిగింది.
4. గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.
5. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యం మరియు దోమల నివారణలో పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

వజ్రకూటంలో టీడీపీలోకి భారీ చేరికలు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 20 కుటుంబాలు..

పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



శంఖవరం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి న్యూస్):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. గ్రామ టీడీపీ నాయకుడు కీర్తి సుభాష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిని పెదశంకర్లపూడిలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. టీడీపీపై విశ్వాసంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. వజ్రకూటం గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలను అభినందించారు.ఈ కార్యక్రమంలో కీర్తి వెంకట్రావు, కీర్తి సత్యనారాయణ, కీర్తి సోమరాజు, కీర్తి మాణిక్యం, కీర్తి బాబ్జి, కీర్తి సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి జోగిరాజు, సూరంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మొత్తం 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

విజయోత్సవ సభ జరుపుకున్న కూటమి నాయకులు

చైర్మన్ ను, కూటమి కౌన్సిలర్లను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





గుంతకల్లు నవంబర్ 4 (ప్రజా జ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్యాంపు కార్యాలయం నందు కూటమి కౌన్సిలర్లు నిర్వహించిన విజయోత్సవ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, గుంతకల్లు నియోజకవర్గం పీఓసీ వాసగిరి మణికంఠ హాజరయ్యారు. గుంతకల్లు మున్సిపాలిటీలో కూటమి నాయకులు ఘనవిజయం సాధించిన సందర్భంగా కూటమి నాయకులు ఎమ్మెల్యే కి పూలమాలలు వేసి ఘనంగా సన్మానిం చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మాట్లాడుతూ స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా గుంతకల్లు పట్టణం మున్సిపల్ చైర్మన్ గా యశోద 6557 ఓట్లు మెజార్టీ విజయం సాధించి నందుకు యశోదకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గుంతకల్లు పట్టణం టిడిపి నుండి 24 మంది బీజేపీ నుండి 1 ఇండిపెండెన్స్ 3 కౌన్సిలర్స్ అఖండ మెజార్టీతో గెలుపొందారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఇండిపెం డెన్స్‌గా గెలుపొందిన 3 కౌన్సిలర్స్ కూటమి ప్రభు త్వంతో చేరడంతో చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గెలిచిన గుంతకల్లు చైర్మన్ మరియు కౌన్సిలర్లు మాట్లాడుతూ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మ నూరు నారాయణ స్వామి మరియు కూటమి నాయకులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్లు చైర్మన్ యశోద మాట్లాడుతూ నన్ను ఆదరించి 6557 ఓట్ల అఖండ మెజార్టీతో గెలిపించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి మరియు గుంతకల్లు పట్టణ కూటమి ప్రభుత్వం నాయకులకు, కార్యకర్తలకు గుంతకల్లు ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవా దములు తెలియజేస్తు న్నాను, అలాగే పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కూటమి గెలుపొందిందని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి అభినందించడం జరిగింది. అదేవిధంగా రాబోయే పంచాయతీ ఎన్నికలలో కూడా ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం మార్క్ రాజకీయం చూపించి చంద్రబాబు నాయుడుకి గిఫ్ట్‌గా అందిస్తామని వారు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ కౌన్సిలర్లు మరియు గుంతకల్లు పట్టణ మరియు మండల కూటమి నాయకు లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డ్రైన్ కట్టలు తెగి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన



బాపట్ల నవంబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాన్ ప్రభావంతో బాపట్ల మండలంలోని జిల్కిళ్లమూడి వద్ద నల్లమడ డ్రైన్ కట్టలు తెగి నీరు గ్రామ పరిసర ప్రాంతాల్లోకి చేరడంతో నీట మునిగిన ప్రాంతాలను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పరిశీలించారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీట మునిగిన ప్రాంతాల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటి ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంటూ, పరిస్థితిని సమీక్షించారు. బాధిత ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైన్ కట్టలు తెగిన ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ముసురు తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి!

రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి

-- సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య



కూనవరం: ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు పోలవరం జిల్లా కూనవరం మండలంలో వరుస తుఫానులు, అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం పార్టీ కూనవరం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక వరి సహా ఇతర పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, వర్షాధారంగా సాగుచేసిన పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయంగా రైతులు మిర్చి, పొగాకు, మినుములు తదితర పంటలు సాగు చేసేందుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. అయితే వరుసగా వచ్చిన తుఫానులు, ముఖ్యంగా ముసురు తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో ఈ పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిని రైతులు కోలుకోలేని నష్టాన్ని చవిచూశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు పంటలు నష్టపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, మరోవైపు వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్న పేద, మధ్యతరగతి వ్యవసాయ కూలీలకు కూడా పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. రైతులను నమ్ముకుని జీవిస్తున్న వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేసిన రైతులు వరుస ప్రకృతి వైపరీత్యాల వల్ల మళ్లీ వ్యవసాయం చేయలేని దుస్థితికి చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఎల్‌నినో ప్రభావంతో కూనవరం మండలంలో ఏర్పడిన కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం పార్టీ అనేకసార్లు పత్రికా ప్రకటనల ద్వారా, ఇతర రూపాల్లో ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు పంట నష్టపరిహారం, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని, కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మడకం నాగమణి, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాస్, ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన డాక్టర్ బాబన్

ధ్రువీకరణ పత్రం అందజేసిన ఎన్నికల అధికారి సంజయ్

నంద్యాల:నవంబర్=04



ప్రజాజ్యోతి ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలకు సంబం ధించి నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత రెండు గంటలకు డాక్టర్ బాబన్ గారు నంద్యాల మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధి కారి డాక్టర్ సంజయ్ కుమార్ ధ్రువీకరణ పత్రం అందజే శారు ఈ కార్యక్రమంలో తెలు గుదేశం నాయకులు ఫిరోజ్ గారు, పలువురు కౌన్సిలర్స్ అభ్యర్థులు సీనియర్ నాయ కులు తదితరులు పాల్గొన్నారు

నల్లమడ డ్రైన్ వరద ఉధృతి. ముంపు బాధితులకు పునరావాసం

కలెక్టర్ ఆదేశాలతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన తహశీల్దార్ షేక్ షలీమ



బాపట్ల నవంబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నల్లమడ డ్రైన్‌కు భారీగా వరద నీరు చేరడంతో బాపట్ల మండలంలోని చెరువు గ్రామం వరద ముంపునకు గురైంది. ఈ నేపథ్యంలో గ్రామంలోని సుమారు 150 కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఆదేశాల మేరకు తహశీల్దార్ షేక్ షలీమ పర్యవేక్షణలో బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన సహాయక సదుపాయాలు కల్పిస్తున్నారు. బాధితులకు భోజనం తదితర అవసరాలను అందిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ భరోసా కల్పించారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

వర్షపు నీటి తొలగింపునకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు

మాదాల నారాయణస్వామి కాలనీలో పనులను పరిశీలించిన కమిషనర్ హాసిని



బాపట్ల నవంబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా బాపట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలనీల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు బాపట్ల పురపాలక సంఘం చర్యలు చేపట్టింది.కర్లపాలెం రోడ్డులోని మాదాల నారాయణస్వామి కాలనీలో ఇళ్ల మధ్య భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ యం. హాసిని సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి తొలగింపునకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.దీంతో డీఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవసరమైన మోటార్లను ఏర్పాటు చేసి కాలనీలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించే పనులు ప్రారంభించారు. ఈ పనుల పురోగతిని కమిషనర్ హాసిని బుధవారం స్వయంగా కాలనీకి వెళ్లి పరిశీలించారు. నీటి తొలగింపు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా నీటిని వేగంగా బయటకు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్యం, నీటి నిల్వ సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ చల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

వరదల వేళ ఎన్నికల భద్రతపై ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ

నల్లమడ వాగు ఉధృతిని పరిశీలించిన వకుల్ జిందాల్



గుంటూరు నవంబర్ 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి) మురసు తుఫాను ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ పెద నందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, దుగ్గిరాల తదితర మండలాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నల్లమడ వాగు ప్రవాహ ఉధృతిని పరిశీలించి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు.రేపు జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, ముట్లూరు, కోవెలమూడి, దుగ్గిరాల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలు, రహదారుల పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చోట ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహకారం తీసుకోవాలని సూచించారు.జిల్లాలో 13 జెడ్పీటీసీ, 200 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏడు ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఈ పర్యటనలో సౌత్ డీఎస్పీ జి.పూర్ణచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, పెదనందిపాడు ఎస్సై, దుగ్గిరాల ఎస్సై తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పోలీసుల పటిష్ట భద్రతా కవచం! జిల్లా ఎస్పీ కే చక్రవర్తి

670 మంది పోలీసులతో బందోబస్తు..
275 పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

చింతూరు నవంబర్ 4, ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు

670 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ నవంబర్ 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలవరం జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు బుధవారం వెల్లడించారు. జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ, 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 368 పోలింగ్ లొకేషన్ల పరిధిలో 275 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 22 అత్యంత సమస్యాత్మక, 44 సమస్యాత్మక, 209 సాధారణ పోలింగ్ లొకేషన్లుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

670 మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికల బందోబస్తు:

ఎన్నికల భద్రత కోసం మొత్తం 670 మంది పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగింది. ఇందులో 3 మంది డీఎస్పీలు, 11 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, 86 మంది ఏఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, 86 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు, 273 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లు, 176 మంది హోంగార్డులు విధులు నిర్వహించనున్నారు.

ముందస్తు చర్యలు:

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 383 మంది చెడు నడత కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లపై బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 71 కేసులు నమోదు చేయగా, అక్రమ మద్యం స్వాధీనానికి సంబంధించి 133.7 లీటర్ల మద్యం, రూ. 5,10,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా:

పోలింగ్ కేంద్రాలకు వెళ్లే నిర్దేశిత మార్గాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షించేందుకు రూట్ మొబైల్స్, ఫ్లైకింగ్ ఫోర్స్, స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి శాంతిభద్రతలను అదుపులోకి తీసుకునేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అన్ని భద్రతా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తాయని తెలిపారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి:

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని, ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజలకు పోలీస్ శాఖ విజ్ఞప్తి:

పోలింగ్ ముగిసిన అనంతరం కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసినా, లేదా ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 9440900762కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ ప్రజలను కోరారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి మా పార్టీకు సహకరించిన గుంతకల్లు పట్టణ ప్రజలకు ధన్యవాదాలు

గుంతకల్లు నవంబర్ 4 (ప్రజా జ్యోతి): పట్టణంలోని ధర్మవరం గేట్ దగ్గర ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం. మహేంద్ర ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నబి రసూల్, జిల్లా జనరల్ సెక్రెటరీ అబ్దుల్ మాలిక్ సాబ్ పాల్గొన్నారు. మాలిక్ సాబ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన వివిధ పార్టీల కౌన్సిలర్లకు, తెలుగుదేశం పార్టీ తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా విజయం సాధించిన యశోదమ్మ కి. ధన్యవాదాలు మరియు శుభాకాంక్షలు తెలియజే స్తూ, కాంగ్రెస్ పార్టీ గుంతకల్ పట్టణంలో 15 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థు లు బరిలో దిగిన దాఖలాలు లేవు.. కాంగ్రెస్ పార్టీ తరపు న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో పార్టీ తరపున పోటీ చేయాలని పార్టీని బలోపేతం చేయాలని పార్టీ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లా లని ఒక ఆకాంక్షతో ఆలోచ న చేసి ముందుకు తీసుకెళ్లి న వ్యక్తి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ నబి రసూల్ వారి పట్టదలతో ప్రజలకు సేవ చేయాలని భావించి వారి ఇంటిలో ఉన్న వ్యక్తుల ను.. బాగా చదువుకున్న అమ్మాయి.. ఫరీదా బి ని గుంతకల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీ చేయించడం గుంతకల్ పట్టణ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు అభ్యర్థి ఫరీదాబి కి.. ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని ఆదరిం చారు. మీ ఆదరణ చూపిన కాంగ్రెస్ పార్టీకి మరి నాయకులకు మరింత బలాన్ని చేకూర్చారు ప్రజలు ఆశీస్సులు ఉన్నంత కాలం మరింత ఉత్సాహం తో ప్రజలకు పని చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుందని తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన పట్టణ ప్రజలకు అందరికీ. ధన్యవాదాలు అని తెలియజేశారు. నబి రసూల్ మాట్లాడుతూ మేము ఓడి గెలిచామన్నా రు. అది ఎలా అంటే.. కాంగ్రెస్ పార్టీ అనేక రకాలుగా పేద ప్రజలకు పథకాల అందించి ప్రజలను ఉన్నతమైన స్థాయిలో నిలబెట్టి పేదలకు అండగా నిలిచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ నిత్యం పేద ప్రజల కోసం ప్రజా సమస్యలపై



రాహుల్ గాంధీ ప్రజాపోరాటం చేస్తుంటే వారికి మా వంతు గా అండగా నిలబడాలని ఈ ప్రజాక్షేత్రంలో స్థానిక ఎన్నికలు పోటీలో కాంగ్రెస్ పార్టీ తరపున గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఫరీదాబి ని నేను నిలబెట్టడం జరిగింది. మరి కాంగ్రెస్ పార్టీ కి వేల సంఖ్య లో ఓట్లు పడతాయని అనుకోలేదు ఎందుకంటే రెండు ప్రధానమైన పార్టీలు అన్ని విధాలుగా గట్టి పోటీ లో ఉన్నాయి... అయితే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఎక్కడే గాని డబ్బు ప్రభావం గానీ వివిధ రకాలుగా ప్రజలకు ఆశ చూపించింది గాని లేదు... కాంగ్రెస్ పార్టీ వస్తే పేద ప్రజలకు అండగా ఉంటామని పట్టణం అభివృద్ధి చేస్తామని మేము చదువుకున్న వ్యక్తులం ఒక్క అవకాశం కల్పించండి అని పట్టణ ప్రజలను అభ్యర్థించడం జరిగింది. అయితే గుంతకల్లు పట్టణ ప్రజలు వేల ఓట్లు మా పార్టీకి వేసి మమ్ములను ఇంత పెద్ద ఎత్తున ఆదరించిన తీరు చూస్తే... కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చారు.. మీరు చూపించిన ఈ ఆదరణ కాంగ్రెస్ పార్టీ విజయానికి చేకూర్చే రోజు వస్తుందని తెలియజేస్తూ.. మరొక్కసారి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ పట్టణ ప్రజలకు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసన్న, రామచంద్ర, కృష్ణయ్య పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు వేగవంతం

ముఖ్యమంత్రి సమీక్షలో జిల్లా పరిస్థితులను వివరించిన కలెక్టర్

బాపట్ల నవంబర్ 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాన్ కారణంగా జిల్లాలో పలుచోట్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరా, రహదారుల వ్యవస్థలను పునరుద్ధరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలను ముమ్మరం చేసింది. రానున్న 48 గంటల్లో జిల్లాలో సాధారణ పరిస్థితులు నెలకొల్పే లక్ష్యంతో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ముఖ్యమంత్రికి వివరించారు.తుఫాన్ అనంతరం జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులు, చేపట్టిన సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చేపడుతున్న పనులపై వివరించారు. గురువారం జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా దెబ్బతిన్న రహదారులపై రాకపోకలను పునరుద్ధరించే పనులు చేపట్టినట్లు వివరించారు. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు సాధారణ జీవన పరిస్థితులు కల్పించేందుకు యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు.ఇదిలా ఉండగా, గురువారం జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేసి, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ హరికుమార్, తహశీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



అడవి పందుల వేట లో ముగ్గురు అరెస్ట్



సిరివెళ్ల:నంద్యాల:నవంబర్=04 ప్రజాజ్యోతి నంద్యాల వన్యప్రాణి విభాగం డిడి పిటి డాక్టర్ శ్రీ చైతన్య కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, చలమ రేంజ్ ఆఫీసర్ డి నాగభూషణం గారి ఆధ్వర్యంలో చలమ రేంజి అటవీ సిబ్బంది మహాదేవపురం గ్రామంలో సమాచారం మేరకు అడవిలోకి వెళ్లి అడవి పందులను వేటాడి, మాంసంగా తయారుచేసి విక్రయించుటకు సిద్ధంగా ఉంచిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.వన్యప్రాణుల చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, ఆళ్లగడ్డ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా రిమాండ్ కు ఆదేశించమానరు. ఈ కార్యక్రమంలో డి నాగభూషణం ఎఫ్ ఆర్ ఓచలమ రేంజి, వై నాగేంద్రయ్య ఎఫ్ యస్ ఓ మొబైల్ పార్టీ, కే మద్దిలేటి స్వామి ఎఫ్ యస్ ఒపెద్ద కంబలూరు సెక్షన్, ఏ రామారావు ఎఫ్ బి ఓ పచ్చర్ల బీటు, నాగప్ప ఎఫ్ బిఓ కోటకొండ బీటు, ప్రొటెక్షన్ వాచర్లు, తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ డాక్టర్ దివ్యతేజకు కెమిస్ట్ అసోసియేషన్ నాయకుల అభినందనలు



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి) బద్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దివ్యతేజ, డాక్టర్ క్రాంతికుమార్‌లను బద్వేల్ పట్టణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల రాధాకృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు కె.వి. సుబ్బారావు, దర్శి సుబ్బరాజా, మాలేపాటి సుధాకర్, పామూరు వెంకటేశ్వర్లు, పత్తి నరసింహ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్రాల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే పట్టణంలో ప్రజలు, చిన్నారులు ఆహ్లాదకరంగా గడిపేందుకు అనువైన పబ్లిక్ పార్కులు లేకపోవడంతో, ప్రస్తుత పాలకవర్గ హయాంలోనైనా ఒక సుందరమైన పార్కును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బద్వేల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కోరారు.

డోన్ మునిసిపాలిటీ వైసీపీ అభ్యర్థులకు, సన్మానం బుగ్గన





డోన్ ప్రజా జ్యోతి నవంబర్ 4 నంద్యాల జిల్లా డోన్ పట్టణం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు బుధవారం మాజీ ఆర్థిక శాఖమంత్రిబుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ న్యాయ బద్ధంగా ఓటింగ్ జరిగి ఉండి ఉంటే ఇంకా బోయ చైతన్య మా చైర్మన్ అభ్యర్థి అధిక మెజార్టీ తో గెలుపొందేవారు మతలబ్ చేసి రిగ్గింగ్, వైఎస్ఆర్సిపి ఏజెంట్లను ఇబ్బంది పెట్టినప్పటికీ ,చైతన్యమ్మ అధిక సంఖ్యలో గెలుపొందడం నైతిక విజయం మాదే, అని తెలిపారు, తెలుగుదేశం పార్టీ వాళ్లు ఎంచిన కట్టలనువాటిని తిరిగి మళ్లీ కొన్ని కట్టలు బండలు కలిపి కౌంట్ చేయడం వల్ల కావాలనే లేట్ చేయడం వల్ల లైట్ ఫెయిల్ అయినప్పటికీ అధికారులకు హుకుం జారీ చేసి అధికార దుర్వినియోగంతో అధికారులను భయపెట్టి 375 ఓట్ల మెజార్టీ మాది విజయం మేమే సాధించాం ,మేమే గెలిచాం, అని మున్సిపాలిటీ చైర్మన్ సీటు దక్కించుకున్నారు, తీసుకున్న సీటు ఎప్పటికీ ఆ సీటు చూసినప్పుడల్లా బోయ చైతన్యమ్మ గుర్తొస్తారని బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి అన్నారు ఒకరు కష్టపడి గెలుచుకున్న సీటును లాక్కోవడం ఎంత బాధకరం, ఎంత మోసం, వారి ఆత్మకు తెలుసు భగవంతునికి తెలుసు అని తెలిపారు డోన్ ,మున్సిపాలిటీ టౌన్ ప్రజలు ఈ ఎలక్షన్లను ఎప్పటికైనా గుర్తుపెట్టుకుని ఉంటారు, ప్రజల మద్దతు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పైన, అధిష్టానం పైన ఎక్కువ నమ్మకం ఉంది కాబట్టి, మాకు టౌను ప్రజలంతా ఓట్లు వేసి అధిక మెజార్టీతో మా పార్టీని గెలిపించారు, నీతి నిజాయితీగా చెప్పాలంటే ధర్మంగా డోన్ మున్సిపాలిటీలో 36 వార్డుల కౌన్సిలర్లను మేమే గెలుచుకున్నాం, మునిసిపాలిటీ చైర్ పర్సన్ సీటు వైయస్సార్సీపి పార్టీ అభ్యర్థి గెలుచుకుంది, డోన్ టౌన్ ప్రజలందరికీ నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని తెలిపారు, ఈ కార్యక్రమంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా వైయస్సార్సీపి 36 వార్డు అభ్యర్థులకు శాలువలు వేసి పూల దండలు తో సన్మానం చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో వార్డు అభ్యర్థులు, చైర్ పర్సన్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

ఎన్నికల బందోబస్తుకు ఆధునిక సాంకేతికత అండ

బాపట్ల జిల్లాలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు. 1188 మంది పోలీసులతో బందోబస్తు

సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలపై సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా



బాపట్ల నవంబర్ 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి) జిల్లాలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందు కు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుం డా 1188 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ వెల్లడించారు. ఎన్నికల విధుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు పోలీసు బృందాల మధ్య సమన్వయం కోసం సమర్థ్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందితో ఎస్పీ వర్చువల్ సమావేశం నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 351 గ్రామాల్లో 593 పోలింగ్ లొకేషన్లలో ఎన్నికలు జరగనుండగా, వీటిలో 138 సున్నిత, 92 అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను 29 జోన్లు, 78 రూట్లుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు.ఎన్నికల విధుల్లో 3 డీఎస్పీలు, 18 మంది సీఐలు, 49 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 1188 మంది పోలీస్ సిబ్బంది పాల్గొననున్నారు. వీరికి అదనంగా 337 మంది స్వర్ణ గ్రామ, వార్డు మహిళా పోలీసులతో పాటు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నారు. బందోబస్తులో భాగంగా 18 స్ట్రైకింగ్ పార్టీలు, 78 రూట్ మొబైల్ బృందాలు, ప్రత్యేక స్ట్రైకింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల రాకపోకలు క్రమబద్ధంగా సాగేలా చూడాలని ఎస్పీ సూచించారు. సమర్థ్ యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ అలర్ట్ పంపితే సమీపంలోని పోలీసు బృందాలతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని వివరించారు. సంఘటనా స్థలానికి సంబంధించిన వీడియో, ఫొటోలు, వాయిస్ రికార్డింగ్, సిబ్బంది లొకేషన్ వివరాలు అందడం ద్వారా తక్షణ స్పందనకు అవకాశం ఉంటుందన్నారు.గతంలో నేరాలకు పాల్పడిన, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 2,646 మందిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా, ఘర్షణలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, వర్చువల్ విధానంలో బాపట్ల డీఎస్పీ సీహెచ్.చంద్రమౌళి, చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, ఎన్నికల విధులు నిర్వహించనున్న సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేసే హక్కు ఉంటే - ప్రాణహాని రక్షణ లేదా..?

కౌంటింగ్ కేంద్రంలో దాడి - దళిత కుటుంబానికి రక్షణ కల్పించండి.
దళిత మహిళా పోటీ చేసిందని దాడులా..?
తలారి రంగయ్య శైలజానాథ్ కలెక్టర్ కు ఫిర్యాదు.
మున్సిపాలిటీ 30వ వార్డులో రీ-పోలింగ్ నిర్వహించాలని డిమాండ్.





కళ్యాణదుర్గం ప్రతినిధి శివ:- నవంబర్ 4,2026,(ప్రజా జ్యోతి న్యూస్.) కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జె.హరిప్రకాష్ జిల్లా అధికారులను కోరారు.మాజీ ఎంపీ,కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త డా.తలారి రంగయ్య గారి ఆధ్వర్యంలో,సింగనమల సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్,ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు అందజేశారు.ఈ ఘటన కారణంగా తమ కుటుంబ సభ్యుల ఆత్మగౌరవానికి భంగం కలగడమే కాకుండా,కుటుంబ పరువుకు ముప్పు ఏర్పడిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే రాజ్యాంగబద్ధమైన హక్కులకు విఘాతం కలిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రంలో తమ తరపున ఏజెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తమను కులం పేరుతో దూషించారని, బెదిరించారని, విధులు నిర్వహించకుండా, అడ్డుకుని బలవంతంగా బయటకు పంపించారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు.కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని కూడా ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటన అనంతరం నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని,బయట తిరగడానికి కూడా భయపడుతున్నామని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.తమకు పోలీసు రక్షణ కల్పించాలని,నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.ఈ సందర్భంగా డా.తలారి రంగయ్య మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.కులం,మతం పేరుతో వేధించడం, దాడులు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు.డాక్టర్ సాకే శైలజానాథ్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిష్పక్షపాతంగా జరగాలి.కౌంటింగ్ కేంద్రంలోని సిసిటివి ఫుటేజీని భద్రపరిస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. దళిత కుటుంబానికి చెందిన మహిళ ఎన్నికల్లో పోటీ చేయడం నేరం కాదని,ఆమెకు మద్దతుగా నిలిచిన కుటుంబాన్ని వేధించడం దారుణమని అన్నారు.ఎన్నికలపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టాలంటే రీ-పోలింగ్ పై పరిశీలన చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులో ప్రధాన డిమాండ్లు వివరిస్తూ,ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి,బాధ్యుల పై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.మరియు కులం పేరుతో దూషించడం,దాడి చేయడం,వేధింపులకు పాల్పడిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం - 1989 తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలి.కౌంటింగ్ కేంద్రంలోని సీసీటీవీ ఫుటేజీ, వీడియో రికార్డింగులు,కౌంటింగ్ రికార్డులు, సంబంధిత అధికారుల నివేదికలను సేకరించి భద్రపరచాలి. కౌంటింగ్ కేంద్రంలో జరిగినట్లు ఆరోపిస్తున్న దాడులు, బెదిరింపులు,ఎన్నికల ఏజెంట్ల విధులకు కలిగించిన ఆటంకాలపై స్వతంత్ర విచారణ జరిపించాలి.ఎన్నికల ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు,కౌంటింగ్ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించిన అంశాలపై విచారణ జరిపి,చట్టబద్ధమైన పరిశీలన అనంతరం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ 30వ వార్డులో రీ-పోలింగ్ నిర్వహించాలి.ఫిర్యాదుదారుడితో పాటు ఆయన భార్య,అన్న కుటుంబ సభ్యులకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలి.ఈ ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలి.అదే విధంగా రాజ్యాంగ హక్కులకు భంగం కలగకుండా,భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు,జీవించే హక్కు,వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవన హక్కులపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు.ఒక దళిత కుటుంబానికి చెందిన మహిళ ఎన్నికల్లో పోటీ చేసినందుకు, ఆమె తరపున ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించినందుకు వేధింపులు,దాడులు ఎదుర్కోవాల్సి రావడం ఆందోళనకరమని ఫిర్యాదులో వివరించారు.ఈ ఘటన కళ్యాణదుర్గంలో తీవ్ర చర్చకు దారితీసింది.ఎన్నికల్లో ఓటు వేయడం,పోటీ చేయడం ప్రతి పౌరుడి హక్కు అని,ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాలని కోరుతున్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కులకు రక్షణ కల్పించడం అధికారుల బాధ్యత.ఫిర్యాదుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.ఈ కార్యక్రమంలో యువ నాయకులు తలారి హర్ష,సాకే రూత్విక్,అడ్వకేట్ రామాంజినేయులు,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎంపీడీవో ఏ. రాజు.



ఆలమూరు, నవంబర్ 4 (ప్రజాజ్యోతి):ఆలమూరు మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్ఓ), ఎంపీడీవో ఏ. రాజు బుధవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి సకాలంలో, సురక్షితంగా చేరిందా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బందితో మాట్లాడి వారికి కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ముఖ్యంగా సిబ్బందికి భోజనం, తాగునీరు తదితర వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు.అనంతరం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. రాత్రి సమయంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు లేదా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో ఏ. రాజు సూచించారు.

విచ్చలవిడిగా మద్యం..... ఓటుకు నోటు.

500 నుంచి 1000 రూపాయలు ఓటు రేటు.

ముత్తుకూరు, నవంబర్ 4(ప్రజా జ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రజల నుండి ఓట్లు వేయించుకునే ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిబంధనలను తుంగలో తొక్కినారు. జడ్పిటిసి తో పాటు 17 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా డబ్బు, మద్యం, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వకూడదు అనేది ఎన్నికల కమిషన్ నిబంధన. కానీ ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు బహుమతులు ఇవ్వకపోయినా తాయిలాలుగా మిగతావి రెండు ఓటర్లకు అందజేశారు. తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఓట్లను ఆకర్షించారు. మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో బుధవారం యదేచ్ఛగా భయం లేకుండా పట్టపగలే మద్యంతో పాటు ఓటర్లకు 500 రూపాయలు నుంచి 1000 రూపాయల వరకు అందజేశారు. ఎక్కడ కూడా ఎన్నికల నిబంధనలు అమలు కాలేదు. ఇంటింటికి పంచిపెట్టారు. కొన్ని పంచాయతీల్లో క్వాలిటీ మద్యాన్ని ఓటర్లకు అందజేశారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎక్కడ కూడా తనిఖీలు చేసిన పాపాన పోలేదు ఒక





విధంగా చెప్పాలంటే అభ్యర్థులకు వెసులుబాటు కలిగింది. ఆయా పార్టీల కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు తాయిలాలు ఇచ్చి ఓట్లు రాసుకున్నారు.

సంవత్సరానికి వంద రూపాయలు నుంచి 200 రూపాయల వరకు గిట్టుబాటు.

ప్రజాస్వామ్యం అబాసు పాలైంది. రాజకీయ నాయకులు ఇచ్చిన ఓటుకు డబ్బులు సంవత్సరానికి వంద రూపాయలు నుంచి 200 రూపాయల వరకు గిట్టుబాటు కావడం జరిగింది. ఓట్లు అమ్ముకున్నారా లేక కొనుక్కున్నారు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఒక్కొక్క సెగ్మెంట్లో 10 లక్షలు నుంచి 15 లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు పెట్టారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు జడ్పిటిసి అభ్యర్థి నుంచి ఎంపిటిసి అభ్యర్థుల వరకు నాలుగు లక్షల నుంచి 8 లక్షల రూపాయల వరకు మాత్రమే ఖర్చు పెట్టాలి. కానీ ఇక్కడ అంతకు మించి నాలుగు రెట్లు ఖర్చు పెట్టారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ



ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

నీలా మోసాలు చేయడం మా ఎమ్మెల్యేకు చేతకాదు

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

షాద్ నగర్ కాంగ్రెస్ నేత రఘు నాయక్ హెచ్చరిక

షాద్‌నగర్ అభివృద్ధిని చూసి ఓర్వలేకే విష్ణువర్ధన్ రెడ్డి అసత్య ప్రచారాలు

ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఎమ్మెల్యేపై చవకబారు విమర్శలా?

విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలకు గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ ఆగ్రహం

పాలమూరు సొంత రాజకీయ కుంపటి తప్ప మరొకటి కాదు

జూనియర్ కేఏ పాల్ చేతలు మానుకో..!

షాద్ నగర్ : నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న స్థానిక శాసనసభ్యుడిపై షాద్ నగర్ జూనియర్ కేఏ పాల్ గా పేరు గాంచిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నిరాధారమైన, చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల స్థానిక నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేకు పనులు చేయడం చేతకాదని, పరిపాలనపై అవగాహన లేదంటూ మాట్లాడటం విష్ణువర్ధన్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే అభివృద్ధిని విస్మరించి వ్యక్తిగత విమర్శలు, బెదిరింపు ధోరణికి దిగితే ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల ప్రగతిని చూడండిఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నిధులు మంజూరై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రఘు నాయక్ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు, దర్గా మార్గ ప్రయాణికుల సౌకర్యార్థం వై-జంక్షన్ విస్తరణ, ఆర్ అండ్ బి రహదారి పనుల కోసం పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి మంజూరు చేయించారని వెల్లడించారు.విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ



జూనియర్ కళాశాల ఆధునికీకరణ కోసం దాదాపు రూ.15 కోట్ల సమీకరించడం జరిగిందన్నారు. కొందుర్గు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్టు కింద సుమారు రూ.250 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామంలో అత్యాధునిక 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటుకు నిధులు సాధించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని స్పష్టం చేశారు. 'కామ్రేడ్' పదం వాడే అర్హత నీకు ఉందా?'ఖబర్దార్ కామ్రేడ్' అంటూ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేయడాన్ని రఘు నాయక్ ఎద్దేవా చేశారు. "కామ్రేడ్ అంటే సహచరుడు, ప్రజా ఉద్యమాల్లో కలిసి నడిచే తోటి సోదరుడు అని అర్థం. జాతి నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఆ పదాన్ని గౌరవప్రదంగా ఉపయోగించారు. మతం, కులం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టే సిద్ధాంతాలు కలిగిన బిజెపి పార్టీలో ఉండే నాయకులకు 'కామ్రేడ్' పదాన్ని పలికే నైతిక హక్కు లేదు" అని ఘాటుగా బదులిచ్చారు. నిజంగా నియోజకవర్గ ప్రజల క్షేమం కోరే వారైతే ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వీకరిస్తుందని తెలిపారు. అలా కాకుండా మీడియా ముందు మైలేజ్ కోసం అవాకులు చవాకులు పేలితే రాజకీయంగా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఏ కాంగ్రెస్ పార్టీని అయితే పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తిడుతున్నాడో అదే పార్టీ నుండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపికైన విషయాన్ని మరువద్దని సూచించారు. నువ్వు చేసే పిచ్చి పనులకు ఇక్కడ ప్రజలు జూనియర్ కేఏ పాల్ అని మీపై ప్రచారం చేస్తున్నారని ఇది గమనించుకొని మసలుకోవాలని పేర్కొన్నారు. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ అనుచరుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని చెంపదెబ్బ కొట్టిన అంశాన్ని సైతం ఆయన ప్రస్తావించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్య, డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కు పోగులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సేవకోసమే మా జీవితాలు


అంజలి రమేష్ రెడ్డి



హిందూపురం ప్రజా జ్యోతి న్యూస్:నవంబర్ 04: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి: హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో 17వ వార్డు కౌన్సిలర్ గా బిజెపి పట్టణ అధ్యక్షులు అంజలి రమేష్ రెడ్డి గెలుపొందారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా రాజకీయ క్షేత్రంలో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని ప్రజల కోసం పనిచేస్తున్నాం ప్రజల కోసం కష్టపడితే వాళ్లు మనకి ఎల్లవేళలా అండగా ఉంటారు అనడానికి నిదర్శనం మా వార్డు ప్రజలు రెండవసారి కౌన్సిలర్ గా అవకాశం కల్పించి కౌన్సిల్ హాల్ కు పంపిస్తున్నారు ఈ సందర్భంగా 17వ వార్డు ప్రజల కోసం వార్డు అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తారని తెలియజేశారు ఈ సందర్భంగా హిందూపురం మున్సిపాలిటీలో ఎన్డీఏ కూటమి తరపున బిజెపికి నాలుగు సీట్లు కేటాయించి నాలుగు సీట్లలో విజయ సాధించడం జరిగినది సహకరించిన హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ శ్రీ నందమూరి బాలకృష్ణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మాధవ్ గారికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ జిల్లా అధ్యక్షులు జీ ఎం శేఖర్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎన్డీఏ కూటమి నాయకులకు శక్తివంతం లేకుండా కష్టపడి పని చేసిన మిత్రులకు ముఖ్యంగా స్థానిక ప్రజలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు

పాలకొల్లు ప్రముఖ వైద్యులు డాక్టర్

బాబ్జి కన్నుమూత.



పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 4. పాలకొల్లులో 50 సంవత్సరాలు గా వైద్య సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పి హెచ్ సత్యనారాయణ మూర్తి (డాక్టర్ బాబ్జి) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం పాలకొల్లులోని తమ నివాసంలో కన్నుమూశారు. డాక్టర్ బాబ్జి కన్ను మూసారన్న సమాచారం తెలియగానే పట్టణ ప్రముఖులు, వివిధ సంస్థలు సంఘాల సభ్యులు బంధువులు అభిమానులు డాక్టర్ బాబ్జి నివాసానికి వచ్చి నివాళులు అర్పించారు. పాలకొల్లులో 50ఏళ్ళ క్రితం వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ ఏర్పాటు చేసి నిస్వార్థ ప్రజా వైద్యునిగా వైద్య సేవలు అందించిన డాక్టర్ బాబ్జి సుమారు 50వేల సర్జరీలు చేసి ఎందరికో పునర్జన్మ కల్పించి వైద్యరత్నగా బిరుదు పొందారు. పాలకొల్లు లో సబితా జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసి కొన్నేళ్లపాటు విద్యా సేవలు అందించారు. 2009 అసెంబ్లీ ఎన్నికలలో పాలకొల్లు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గా ఎన్నికయి అయిదేళ్లపాటు నియోజవర్గ ప్రజలకు సేవలు అందించారు. డాక్టర్ సబిత జూనియర్ కాలేజీ స్థాపించి కొన్నేళ్ల పాటు విద్యా సేవనందించారు. పాలకొల్లులో లయన్స్ క్లబ్ వంటి సామాజిక సేవా సంస్థలలో కొనసాగుతూ సేవలందించారు. డాక్టర్ తృవటపల్లి బాబ్జి కుటుంబం గత నాలుగు తరాలుగా వైద్య వృత్తిలో కొనసాగారు. బాబ్జి ముత్తాత, తాత, తండ్రి వైద్య వృత్తిలో కొనసాగగా వంశ వారసత్వం నిలుపుతూ డాక్టర్ బాబ్జి వైద్య రంగం లో అడుగిడారు. . ఆయనకు భార్య ఉన్నారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా వారు డాక్టర్ కోర్సు చదివారు. కుమార్తె వైద్య రంగంలో అడిగిడిన కొన్నాళ్లకే ప్రమాదవశాత్తూ కారు ప్రమాదానికి గురై మృతి చెందారు. కుమారుడు ఇటీవల గుండెపోటుకు గురై మృతిచెందారు.సేవాత త్పరులు డాక్టర్ బాబ్జి కన్నుమూత తో పాలకొల్లు పట్టణంలో విషాదం చోటు చేసుకుంది.

మెహిదీపట్నం హోటల్లో అగ్నిప్రమాదం

హైదరాబాద్ : మెహిదీపట్నం కింగ్స్ రెస్టారెంట్లో రాత్రి 11:40 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. నూడుల్స్ తయారుచేసే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు. లంగర్ హౌస్, అంబర్‌పేట నుంచి ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఘటన జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు.

నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరు

కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ

హైదరాబాద్ : అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది. యుద్ధ పిపాసులుగా ఉండే నేతలకు ఓటమే ఎదురవుతుందని ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏ పాల్ అన్నారు. ఇజ్రాయెల్లో నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆపకపోతే మాజీ స్పీకర్గా మారతావు అంటూ స్పీకర్ మైక్ జాస్సన్ను హెచ్చరించాను. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నేతలు ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. నేటి ప్రపంచంలో ట్రంప్ కంటే పవర్ఫుల్ నేత ఎవరూ లేరు. ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా నేను ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ వచ్చాను. ఇది మన దేశంలో ముఖ్యమంత్రులు, నేతలకు కూడా హెచ్చరికే. మతం పేరుతో గొడవలు పెట్టేవారికి ఇదే నా హెచ్చరిక. బైబిల్ పంచినందుకు మహిళలపై దాడి చేస్తే.. వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. నేను భారత్ కి తిరిగి వస్తా ఒక్కొక్కరి తాట తీస్తా. నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

ఆర్టీసీ మహిళా కండక్టర్

ప్రవళిక మృతి..

మణుగూరు : మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) చికిత్స పొందుతూ కన్నుమూయడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. విధి నిర్వహణలో ఆమెపై జరిగిన అనూహ్య దాడి చివరికి ప్రాణాలు కోల్పోయేలా చేయడం తోటి ఉద్యోగులను కలచివేసింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ప్రవళిక అకాల మరణం పట్ల ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని, దోషిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతి..

కుటుంబానికి అండగా ప్రభుత్వం

హైదరాబాద్: భద్రాద్రిలో బస్సులో చిల్లర విషయంలో జరిగిన గొడవలో ప్రయాణికురాలు తోసేయడంతో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ప్రవళిక చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు.

హైదరాబాద్ లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినా కాపాడుకోలేకపోయామని తెలిపారు. ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలి

'ఉద్యమకారుల యాప్' వెంటనే ప్రారంభించాలి

గన్ పార్క్ వద్ద టీయూ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని విమర్శిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఎదుట గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు నిరసన ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘోర సంఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీయూ జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి రావడం అత్యంత విచారకరమన్నారు. లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ ఆయన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు మరియు వివరాల నమోదు కోసం 'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలని, రాబోయే డిసెంబర్ 9 నాటికి అర్హులైన ఉద్యమకారులందరికీ తెలంగాణ ఉద్యమ ఫలాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, అనుముల రవీందర్, మోత్కూరు మల్లేష్, జి. యాదగిరి, రాజుగౌడ్, అంకం సతీష్, శ్రీశైలం, జాంబవ్, కృష్ణ, గిరి, రాజయ్య, అమరేందర్ గౌడ్, వి. అరుణ, లావణ్య, విజయలక్ష్మి, పుట్ట రంజిత్, అమృత్ తో పాటు పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ--ఏలో చేర్చవద్దు!

చేరిస్తే అత్యంత వెనుకబడిన కులాలకు తీవ్ర అన్యాయం

బురహన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ తీర్మానం



ఖమ్మం : ముదిరాజ్ కులాన్ని బీసీ--ఏ వర్గంలో చేర్చే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని బురహన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ డిమాండ్ చేసింది. ముదిరాజ్‌లను బీసీ--ఏ వర్గంలో చేర్చకూడదని కోరుతూ సంఘం కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. బురహన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ తొలి కార్యవర్గ సమావేశం బుధవారం అధ్యక్షులు జీజుల శంకరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంలోని నాయకులు ముదిరాజ్‌లను బీసీ--ఏ వర్గంలో చేర్చుతామని ఇస్తున్న హామీలు, వాగ్దానాలను కార్యవర్గం తీవ్రంగా ఖండించింది ప్రస్తుతం బీసీ--ఏ వర్గంలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలకు సామాజికంగా, విద్యాపరంగా తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అత్యధిక సంఖ్యాకులైన ముదిరాజ్‌లను ఈ వర్గంలో చేర్చడం వల్ల ఇప్పటికే అందులో ఉన్న వెనుకబడిన కులాల హక్కులు, అవకాశాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను విరమించు కోవాలని ప్రస్తుతం బీసీ--ఏ వర్గంలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాల ప్రయోజనాలను కాపాడాలని కార్యవర్గం ఏకగ్రీవంగా కోరింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు జీజుల శంకరయ్య, కార్యదర్శి పెద్దపల్లి సుధాకర్, కోశాధికారి డోలి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు పెద్దపల్లి సోమయ్య, గౌరవ సలహాదారు పాకాల ఉపేందర్, ఉపాధ్యక్షులు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

ఊరుమడ్లలో బొంగు నరసింహ గౌడ్ దశదిన కర్మకు హాజరైన డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి,దైదా రవీందర్





నల్లగొండ : నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంగు శంకరయ్య గౌడ్ సోదరుడైన కీ.శే. బొంగు నరసింహ గౌడ్ (మరణం: 20-10-2025) ఇటీవల మృతి చెందడంతో, వారి స్వగృహంలో దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లితెలంగాణ రాష్ట్ర డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ లి హాజరయ్యారు. బొంగు నరసింహ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి, చేతులు జోడించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో గుత్తా అమిత్ రెడ్డి మమేకమయ్యారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ సాగర్ల బోవనేశ్వర్, బిక్షం యాదవ్, ఉప సర్పంచ్ ఉయ్యాల నరేష్, వార్డ్ నెంబర్ హరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పోలగాని స్వామి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్తా దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, సీనియర్ నాయకులు వెంక రెడ్డి, చీమల వీరేశం, సత్తిరెడ్డి, జనార్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవండి.. పోలీసు కొలువులు సాధించండి..



శిక్షణ పొందుతున్న యువతకు 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన కలెక్టర్, ఎస్పీ..





సూర్యాపేట : పోలీసు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరుద్యోగ యువత పట్టుదలతో చదివి, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ సూచించారు. లక్ష్యంపై స్పష్టత, సమయపాలన, నిరంతర సాధనతో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు ఉచితంగా ముందస్తు శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 200 మంది అభ్యర్థులకు కోదాడలోని కేఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధవారం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉండాలని, వాటిని చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను అధ్యయనం చేసి పరీక్షల సరళిపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదివి కనీసం మూడుసార్లు పునశ్చరణ చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు ఉద్యోగ ఆశావహులకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందితో బోధన, ఫిజికల్ ఈవెంట్స్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తూ అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నట్లు వివరించారు. ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ.. యువత విలాసాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవాలని, నిరంతర సాధనతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. శిక్షణలో లభిస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.1,400 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల అభ్యర్థులకు ప్రయాణ ఇబ్బందులు కలగకుండా కోదాడలోనే 200 మందికి శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ పోలీసు ఉద్యోగం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సైబర్ నేరాలపై అవగాహన శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ నేరాల గురించి వివరించారు. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ సైబర్ సెక్యూరిటీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఇన్‌స్పెక్టర్లు రామారావు, శివకుమార్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అన్వర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె...

23వ రోజు సమ్మెలో భాగంగా వీరనారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు.. ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్.



ఆదిలాబాద్ :- నిర్మల్ జిల్లా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎన్‌హెచ్‌ఎం (ఎన్ హెచ్ ఏం) ఉద్యోగులు స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు 8 శాతం లాయల్టీ బోనస్‌ను తక్షణమే చెల్లించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించి ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు సమ్మెను విరమించేది లేదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కోఆర్డినేటర్ రమణ, జేఏసీ నాయకులు డా. రమేష్, డా. అలీ, డా. శ్రీమంత్, డా. సన్నిత్, డా. రానా ప్రతాప్, డా. సంధ్యారాణి, వినీత, వంశీ, సుజాత, రాధ, శోభ, గంగమణి, జైపాల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పంపిణీ చేసే బియ్యం నాణ్యతలో రాజీ వద్దు



ఎన్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ ఆకస్మిక తనిఖీలు.. ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు



సూర్యాపేట : గోదాంలలో బియ్యం నిల్వలు, నాణ్యత, నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. పేదలకు పంపిణీ చేసే సన్నబియ్యం నాణ్యతను కాపాడటంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్‌లో ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలో నిల్వ ఉన్న బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) విధానాన్ని అమలు చేయాలని, స్టాక్‌కు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. హమాలీలకు లేబర్ కార్డులు అందేలా చర్యలు.. అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు మంజూరు చేయించాలని హమాలీలు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత కార్మిక శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్డీఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

వరుసగా ఐదో రోజూ లాభాల పంట.. కారణాలివే..



భారతీయ స్టాక్ మార్కెట్లు మరోసారి తమ పట్టును నిరూపించుకున్నాయి. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు, అమెరికా మధ్యంతర ఎన్నికల ప్రభావం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు బుధవారం అదరగొట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సూచీలు వరుసగా ఐదో రోజు కూడా లాభాల బాటను వీడకుండా స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈరోజు మార్కెట్ సెషన్ ప్రారంభంలో కొంత తడబాటు కనిపించినా మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు కోలుకుని లాభాలతో ముగిశాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 383.55 పాయింట్లు బలపడి 77,301.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 149.75 పాయింట్లు ఎగబాకి కీలకమైన 23,960.60 మార్కును తాకింది.

లాభాల వెనుక కొన్ని ముఖ్యమైన కారణాలు

కొంతకాలంగా అమ్మకాలకే పరిమితమైన విదేశీ సంస్థాగత మదుపర్లు ఇటీవల కాలంలో భారత మార్కెట్ల వైపు మళ్లీ దృష్టి సారించారు. బలమైన కార్పొరేట్ ఎర్నింగ్ అంచనాలు, లార్జ్-క్యాప్ షేర్లలో కనిపిస్తున్న ఆకర్షణీయమైన వాల్యుయేషన్ల కారణంగా ఎఫ్ఐఐల నుంచి మద్దతు లభిస్తోంది. నేటి సెషన్‌లో ఎఫ్ఎంసీజీ, రియల్టీ, మెటల్, మీడియా రంగాలు మంచి ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.55%, స్మాల్‌క్యాప్ 100 సూచీ సుమారు 2 శాతం మేర లాభపడటంతో మార్కెట్లో పాజిటివ్ సెంట్రిమెంట్ బలపడింది. ప్రస్తుతం విడుదలవుతున్న క్యూ2 ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా ఉండటంతో కంపెనీల షేర్లపై కొనుగోళ్ల ఒత్తిడి నెలకొంది. కీలక రంగాల కంపెనీల ఆదాయ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని నింపింది. మొత్తం మార్కెట్ లాభాల్లో ముగిసినప్పటికీ గ్లోబల్ టెక్నాలజీ రంగానికి సంబంధించిన అనిశ్చితుల వల్ల నిఫ్టీ ఐటీ విభాగం మాత్రం 1 శాతానికి పైగా నష్టపోయింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ప్రముఖ ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల సరళి, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తీరుతెన్నులను మదుపర్లు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక మూలాలు ఉండటం వల్ల నిఫ్టీ త్వరలోనే 24,000 మైలురాయిని అధిగమించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పసిడికి సుంకాల సెగ..

దేశంలో భారీగా పెరిగిన బంగారం స్మగ్లింగ్!

ముంబై : దేశీయంగా గోల్డ్ డిమాండ్ ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా 29 శాతం క్షీణించింది. దిగుమతి సుంకాల భారం, పెరిగిన ధరలు, బంగారం కొనవద్దంటూ దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో 162.5 టన్నులకే పరిమితమైంది. ఈ క్రమంలో ఈ ఏడాది మొత్తంగా పసిడి కొనుగోళ్లు 6 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 625-675 టన్నులుగానే ఉండొచ్చని మంగళవారం విడుదల చేసిన 'క్యూ3 2026 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' నివేదికలో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. నిజానికి గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో బంగారం అమ్మకాలు 229.8 టన్నులుగా ఉన్నాయని గుర్తుచేసింది. కాగా, పెంచిన దిగుమతి సుంకాలతో దేశంలోకి గోల్డ్ స్మగ్లింగ్ భారీగా జరుగుతున్నదని ఈ సందర్భంగా డబ్ల్యూజీసీ చెప్పడం గమనార్హం. అలాగే పుత్తడి ధరలు పెరిగిన నేపథ్యంలో గోల్డ్ సేల్స్ తగ్గినా విలువపరంగా మాత్రం 3 శాతం పెరిగి రూ.2,41,900 కోట్లుగా ఉన్నది. నిరుడు దాదాపు 230 కోట్ల విక్రయాలు జరిగినా.. దాని వాల్యూ రూ.2,35,090 కోట్లుగానే ఉన్నది.

దేశీయంగా ఈ జూలై-సెప్టెంబర్‌లో 10 గ్రాముల బంగారం రేటు (జీఎస్టీ, దిగుమతి సుంకం లేకుండా) సగటున రూ.1,48,891 (ట్రాయ్ ఔన్స్ 4,262 డాలర్లు) పలికింది. గత ఏడాది ఇదే వ్యవధిలో రూ.1,02,287 (3,457 డాలర్లు)గానే ఉన్నది.

ఆభరణాలకు డిమాండ్ 20 శాతం పతనమై 99.9 టన్నులుగా ఉన్నది. నిరుడు 125 టన్నులు.

బంగారం కడ్డీలు, నాణేలకు ఆదరణ మునుపటితో చూస్తే 40 శాతం తగ్గింది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 91.6 టన్నులుగా ఉంటే.. ఈ ఏడాది కేవలం 55 టన్నులుగానే ఉన్నది.



గోల్డ్ ఈటీఎఫ్‌ల మొత్తం డిమాండ్ కూడా 50 శాతం క్షీణించింది. 10.7 టన్నుల నుంచి 5.3 టన్నులకు దిగజారింది.

దేశీయంగా ఈ 3 నెలల్లో రీసైకిల్డ్ గోల్డ్ 19.2 టన్నులుగా నమోదైంది. నిరుడు 21.8 టన్నులు.

నికరంగా పుత్తడి దిగుమతులు ఈ జూలై-సెప్టెంబర్‌లో గతంతో పోల్చితే 46 శాతం తగ్గి 114.1 టన్నులుగా ఉన్నాయి. క్రిందటిసారి 211.9 టన్నులుగా ఉన్నది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ జూలై-సెప్టెంబర్ గోల్డ్ డిమాండ్ 1 శాతం తగ్గి 1,369 టన్నుల వద్ద స్థిరపడింది. అధిక, నిలకడలేని ధరలే కారణమని డబ్ల్యూజీసీ పేర్కొన్నది. నగల డిమాండ్ 17 శాతం దిగి అత్యంత కనిష్ఠంగా 313 టన్నులుగా ఉన్నది. కరోనా సమయంలోనూ 331 టన్నులకు డిమాండ్ కనిపించినట్టు తెలిపింది. చైనాలో 22 శాతం తగ్గగా, భారత్‌లో 19.5 శాతం పడిపోయినట్టు వివరించింది. అమెరికా, మిడిల్ ఈస్ట్, సౌదీ అరేబియా తదితర దేశాల్లోనూ డిమాండ్ తగ్గుముఖం పట్టడం వరల్డ్ గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేసినట్టు డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ పీటీఐకి తెలిపారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు మంగళవారం తగ్గాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు రూ.700 క్షీణించి రూ.1,41,800 వద్ద నిలిచింది. అలాగే కిలో వెండి విలువ రూ.2,000 పతనమై రూ.1,84,000గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం పసిడి ధర రూ.1,28,000 పలికింది. ఇక అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్స్ గోల్డ్ రేటు 41.19 డాలర్లు దిగి 3,905.44 డాలర్లుగా ఉన్నది. సిల్వర్ 48.97 డాలర్లుగా ట్రేడైంది. కాగా, రాబోయే ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి కొనుగోళ్లు ఊపందుకోవచ్చన్న ఆశాభావాన్ని జ్యుయెల్లర్స్ వ్యక్తం చేస్తున్నారు. దేశీయ గోల్డ్ మార్కెట్‌ను ఈ జూలై-సెప్టెంబర్ నిరాశపర్చినా.. చివర్లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో అప్పటిదాకా తమ కొనుగోళ్లను వాయిదావేసిన చాలామంది తిరిగి ముందుకొచ్చారు. అలాగే దక్షిణ భారతంలో పెండ్లిళ్లు, పండుగల సీజన్ సేల్స్‌కు కలిసొచ్చింది. నగల వర్తకుల ఎక్సేంజీ ఆఫర్లూ కొనుగోలుదారుల్లో కొంత ఉత్సాహాన్నైతే నింపాయి. మొత్తానికి ఈ త్రైమాసికంలో అధికారికంగానైతే బులియన్ దిగుమతులు బాగా పడిపోయాయి. కానీ స్మగ్లింగ్ పెరిగిందన్న సంకేతాలైతే ఉన్నాయి. ఇక రీసైక్లింగ్ సైతం అంతంతమాత్రంగానే జరిగింది. అయితే ప్రస్తుత పండుగ సీజన్‌లో గోల్డ్ మార్కెట్ మళ్లీ కళకళలాడే అవకాశాలున్నాయి. తగ్గుతున్న ధరలు సైతం డిమాండ్‌ను పెంచవచ్చు. తేలికపాటి నగలకు ఆదరణ, ఎక్సేంజీ ఆఫర్ల హవా కనిపించవచ్చు.

బాల కార్మిక చట్టాల అమలుకు ప్రత్యేక సెల్

దేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చట్టాల అమలు తీరుపై సుప్రీంకోర్టు కఠినమైన వైఖరిని ప్రదర్శించింది. బాల కార్మిక (నిషేధ, నియంత్రణ) సవరణ చట్టం నిబంధనలను మరింత పకడ్బందీగా అమలు చేయడానికి, దేశవ్యాప్తంగా పర్యవేక్షణను తీవ్రతరం చేయడానికి ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. బాల కార్మిక చట్టాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడటం వల్ల క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదని కోర్టు తెలిపింది. దీన్ని నివారించేందుకే ఈ సెల్ ఏర్పాటు అత్యవసరమని అభిప్రాయపడింది.



చట్టం అమలులో లోపాలపై కోర్టు అసంతృప్తి

కాగితాలపై చట్టాలు పటిష్టంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు నామమాత్రంగానే సాగుతోందని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పేదరికం, ఉపాధి అవకాశాల లేమి వంటి సామాజిక కారణాలను అడ్డుపెట్టుకుని చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్న ఉల్లంఘనలను సహించేది లేదని హెచ్చరించింది. పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, గృహ కార్మికులుగా చిన్నారులను వినియోగిస్తున్న తీరుపై మరింత కఠిన నిషా అవసరమని ధర్మాసనం నొక్కిచెప్పింది.

ప్రత్యేక సెల్ ప్రధాన విధులు దేశవ్యాప్తంగా బాల కార్మిక నిషేధ చట్టం అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం. రక్షించిన బాలలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పన పథకాలను సక్రమంగా అందేలా చూసి వారిని భవిష్యత్తుకు ధీమా కల్పించడం. చట్టాల ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకునేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్..

తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘనవిజయం





కివీస్‌తో తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

వర్షం కారణంగా లక్ష్యాన్ని 143 పరుగులకు కుదింపు

విరాట్ కోహ్లీ అద్భుతమైన 74 పరుగుల ఇన్నింగ్స్

భారత పేసర్లు అర్ష్‌దీప్, గుర్నూర్, కంబోజ్ అద్భుత ప్రదర్శన

185 పరుగులకే కుప్పకూలిన న్యూజిలాండ్ జట్టు

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం పదేపదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత యువ పేస్ త్రయం అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ అద్భుతంగా రాణించారు. మేఘావృతమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాటర్లను ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లతో చెలరేగగా, గుర్నూర్ 3, అన్షుల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరి దెబ్బకు న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. కివీస్ జట్టులో ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బ్లెయిర్ టిక్నర్ కేవలం 23 బంతుల్లో 4 సిక్సర్లతో 34 పరుగులు చేసి అనూహ్యంగా మెరిశాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 200 పరుగుల మార్కును కూడా దాటలేకపోయింది. లక్ష్య ఛేదనలో టీమిండియా ఆరంభంలోనే ఒక వికెట్ కోల్పోయినా, విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో తన 80వ అర్ధశతకాన్ని నమోదు చేసిన కోహ్లీ, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత ఛేదన సమయంలో వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్) ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించారు.

ఈ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే, లక్ష్యానికి చేరువవుతున్న సమయంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయినప్పటికీ, చివరకు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

స్పోర్ట్స్

రోహిత్ భాయ్ చేసిన ఆ రనౌటే మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్: గిల్

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై 5 వికెట్ల తేడాతో భారత్ విజయం


యువ బౌలర్లు అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ అద్భుతంగా రాణించారని ప్రశంస

లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ మా పనిని సులభం చేసిందన్న కెప్టెన్

స్థిరత్వంతో ఇదే ప్రదర్శన కొనసాగించడమే లక్ష్యమని స్పష్టం



న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ ను భారత జట్టు విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) కివీస్‌పై ఘన విజయం సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, విజయం అనంతరం మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ చేసిన ఒకే ఒక్క రనౌట్, మ్యాచ్ గతిని పూర్తిగా మార్చేసిందని ప్రశంసించాడు. మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ, "మా బౌలింగ్, ఫీల్డింగ్ ఈరోజు చాలా అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా రోహిత్ భాయ్ చేసిన రనౌట్ ఆటలో పరిస్థితిని మా వైపు తిప్పింది. అదే మ్యాచ్‌కు కీలక మలుపు అని నేను భావిస్తున్నాను. మిచెల్, ఫిలిప్స్ మధ్య భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో ఆ వికెట్ పడటం మాకు ఎంతో కలిసొచ్చింది. వారు గతంలో భారత్‌లో కూడా అద్భుతంగా ఆడారు. వారిద్దరినీ విడదీయడం కీలకం అయింది. ఓవరాల్‌గా ఇది ఒక గొప్ప జట్టు ప్రదర్శన" అని వివరించాడు. యువ బౌలర్ల ప్రదర్శనపై గిల్ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించాడు. "ఇక్కడి పరిస్థితులకు అన్షుల్ కంబోజ్ లాంటి బౌలర్ కరెక్ట్‌గా సరిపోతాడు. అతను ఎప్పుడూ చురుగ్గా ఉంటూ బంతిని సీమ్ చేయడానికి ప్రయత్నిస్తాడు. పాత బంతితోనూ అతను చాలా ప్రభావవంతంగా ఉంటాడు. మరోవైపు, వికెట్ నుంచి పెద్దగా సహకారం అందని సమయంలో గుర్నూర్ బ్రార్ తన పేస్, అదనపు బౌన్స్‌తో ప్రభావం చూపగలడు. ఇవాళ వారిద్దరూ బౌలింగ్ చేసిన తీరు చూడటానికి అద్భుతంగా అనిపించింది" అని అన్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం కలగడం, లక్ష్యాన్ని కుదించడం వంటి అంశాలపై స్పందిస్తూ, "ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకున్న తర్వాత వర్షం పడి ఆట ఆగితే తిరిగి ఏకాగ్రత సాధించడం అంత సులభం కాదు. వర్షం తర్వాత పిచ్ వేగం కొద్దిగా పెరిగింది, బంతి మరింత చురుగ్గా కదిలింది. లక్ష్యం కూడా తగ్గడంతో మేం మా సాధారణ ఆట ఆడేందుకే ప్రయత్నించాం. ఆ సమయంలో విరాట్ భాయ్ ఆడిన తీరు మా పనిని చాలా సులభతరం చేసింది" అని గిల్ పేర్కొన్నాడు. తదుపరి మ్యాచ్‌కు జట్టులో చేయాల్సిన మార్పులపై అడగ్గా, "ప్రత్యేకంగా మార్పులేమీ అవసరం లేదు. మాకు స్థిరత్వమే ముఖ్యం. ఇదే ప్రదర్శనను మళ్లీ మళ్లీ పునరావృతం చేయగలిగితే, మేం చాలా మంచి స్థితిలో ఉంటాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌట్ అయింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్దేశించగా, జట్టు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.



కిరణ్ అబ్బవరం 'హతః' విడుదల వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా వ్యవహరిస్తున్న రెండో చిత్రం 'హతః' విడుదల వాయిదా పడింది. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాల పోటీ ఎక్కువగా ఉండటం, ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, అత్యుత్తమ సౌండ్ అండ్ విజువల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రంలో కుష్ము మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

అఫిషీయల్.. రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' మరియు 'టర్మరిక్ మీడియా' బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల 'ధర్మన్' చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.




ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు.. ఆసక్తికరంగా 'మాయ లేడీ' ట్రైలర్!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాకేష్ వర్రె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాయ లేడీ' తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఫుల్ టైం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రాకేష్ వర్రె మరియు మధుమితల నటన, విజువల్స్ మరియు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవారికి మంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.



మిక్స్‌డ్ టాక్‌ను తట్టుకుని నిలబడిన 'రణబాలి'.. బాక్సాఫీస్ వద్ద రూ.82 కోట్ల గ్రాస్ కలెక్షన్లు!



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో భారీ అంచనాల మధ్య విడుదలైన 'రణబాలి' చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. సినిమా విడుదలైన ప్రారంభంలో కొన్ని మిక్స్‌డ్ టాక్ మరియు భిన్న స్పందనలు వచ్చినప్పటికీ, వీకెండ్స్ మరియు వర్కింగ్ డేస్‌లోనూ సినిమా వసూళ్లు మాత్రం ఎక్కడా తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. చిత్రానికి ఉన్న క్రేజ్ మరియు బీ, సీ సెంటర్స్ లో లభిస్తున్న ఆదరణ కారణంగా కలెక్షన్లు స్థిరంగా వస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 82 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను సాధించినట్లు అంచనా వేస్తున్నారు. థియేట్రికల్ రన్‌తో పాటు ఈ సినిమా నాన్-థియేట్రికల్ బిజినెస్ కూడా భారీ స్థాయిలోనే జరిగినట్లు తెలుస్తోంది. శాటిలైట్, డిజిటల్ (ఓటీటీ) మరియు ఆడియో రైట్స్ రూపంలో నాన్-థియేట్రికల్ బిజినెస్ ద్వారా సుమారు రూ. 85 కోట్లు రాబట్టినట్లు సమాచారం.



'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'.. కింగ్100 టబు గ్లింప్స్

అక్కినేని నాగార్జున 100 వ చిత్రం 'కింగ్ 100'. ఈ సినిమా నుంచి ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. 'మనుషుల్లో రెండు రకాలు.. కష్టాన్ని నమ్మేవాళ్లు, అదృష్టాన్ని నమ్మేవాళ్లు. 'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'.. అంటూ ఆమె చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ గట్టిగానే మ్యూజిక్ అందించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. రా. కార్తిక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న 'కింగ్ 100' డిసెంబర్ 24 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నాగార్జున 100వ చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గ్లింప్స్ కూడా ఆకట్టుకుంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,